

మహానాడు సభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, చిత్రంలో డీఐజీ, ఎస్పీ తదితరులు





ఊటుకూరు రింగు రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఆర్చి, మహానాడు వేదిక వద్దకు వెళుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు, తదితరులు



గుంటూరు జిల్లా నుంచి మహానాడు ప్రాంగణానికి సైకిల్‌పై వచ్చిన షేక్ ఖాజాను అభినందిస్తున్న మంత్రులు

తుదిదశకు మహాపనులు

- నేటితో మహానాడు పనులు పూర్తి
- జన సమీకరణ, వసతిపై మంత్రుల బృందం సమీక్ష
- పసుపుమయంగా మారుతున్న కడప
- రేపు నారా లోకేశ్ రాక
- వీఐపీలతో కడప కిటకిట
- పటిష్ట బందోబస్తు : డీజీపీ

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మహానాడుకు కడప ముస్తాబు అవుతోంది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నగర శివార్లలోని పబ్బాపురంలో 125 ఎకరాల్లో మహానాడు నిర్వహించనున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు.. ఇలా దాదాపు 25వేల మంది తొలి రెండురోజులు జరిగే కార్యక్రమానికి హాజరు కానున్నారు. దీనికి సంబంధించి వేదిక పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి దాదాపు పూర్తి కావచ్చు. తొలి రెండురోజులు 27, 28లలో నిర్వహించే ప్రతినిధుల సభకు వేదిక దాదాపు పూర్తయింది. భోజనశాల, సీఎంవో క్యాంపు ఆఫీసు, ఫొటోఎగ్జిబిషన్, రక్తదాన శిబిరం పనులు పూర్తయ్యాయి. ఇక చివరి రోజు 29వతేదీన నిర్వహించే బహిరంగసభ వేదిక పనులు 70 శాతం పూర్తయ్యాయి. గ్యాలరీ పనులూ పూర్తయ్యాయి. ఆదివారం రాత్రికి అన్ని పనులు [illegible] కానున్నాయి. ఇక ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకండా ఉండేందుకు పార్కింగ్ ప్రదేశాలను ముమ్మరంగా శుభ్రం చేస్తున్నారు. బహిరంగసభ అనంతరం వాహనాలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు గాను రింగురోడ్డులో అక్కడక్కడా డివైడర్లను తొలగిస్తున్నారు.

కడప పసుపుమయం

మహానాడు సందర్భంగా కడపను పసుపుమయంగా మారుస్తున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ సర్కిల్, సంధ్యాసర్కిల్, ఐటీఐ ఇతర సర్కిళ్లన్నీ పసుపుమయం చేశారు. రోడ్డు పొడవునా పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మహానాడు సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సోమవారం కడపకు రానున్నారు. మహానాడు ఏర్పాట్లపై జనసమీకరణపై చర్చించనున్నారు.

జన సమీకరణపై..

మహానాడుకు జన సమీకరణపై ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంత్రుల బృందం చర్చించింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి బహిరంగసభకు వచ్చే జనాలకు పులివెందులలో భోజన వసతి ఏర్పాటు చేస్తామని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వెల్లడించారు. దాదాపు 20వేల మందికి ఇక్కడ భోజన సదుపాయం కల్పించనున్నట్లు వివరించారు. ఇక ఐదులక్షల మందితో భారీ బహిరంగసభ నిర్వహించాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యం. అందుకు తగ్గట్లు కడప చుట్టుపక్కల 50 నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేయనున్నారు. కడప జిల్లా నుంచే 2.10 లక్షల మందిని తీసుకురావాలని టార్గెట్ ఇచ్చారు. ఇక పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జమ్మలమడుగు, బద్వేలు ఇన్‌చార్జిలు భూపేశ్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా రాజు, అనుడా చైర్మన్ రూపానందరెడ్డితో మంత్రులు అనగాని సత్యప్రసాద్, సంధ్యారాణి, బీసీ జనార్ధనరెడ్డి, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీటీ నాయుడు, రవిచంద్రలు జన సమీకరణపై చర్చించారు. ఇచ్చిన టార్గెట్ ప్రకారం జనాలను సమీకరించాలని నిర్ణయించారు. వాహనాల కొరత లేకుండా చూడాలన్నారు.

మంత్రుల కమిటీ సమీక్ష

మహానాడు ప్రాంగణ పనులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనర్ధానరెడ్డి, నిమ్మల రామానాయుడు, సంధ్యారాణి, మంత్రి రవికుమార్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీద రవిచంద్రయాదవ్, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వర్‌రావు, దామచర్ల సత్య తదితరులు శనివారం పరిశీలించారు. బహిరంగసభకు హాజరయ్యే కార్యకర్తలు, నాయకులు, జనాలకు భోజన ఏర్పాట్లను పర్యవేక్షించారు. బహిరంగసభకు వచ్చేవారి కోసం ఐదు ఎంట్రీ పాయింట్లను గుర్తించారు. పులివెందుల రోడ్డు, తాడిపత్రి-కమలాపురం రోడ్డు, మైదుకూరు-కర్నూలు రోడ్డు, సిద్దవటం-బద్వేలు రోడ్డు, సీకేదిన్నె-రాజంపేట రోడ్డులోని రిమ్స్ హాస్పిటల్ ప్రాంతాన్ని ఎంట్రీ పాయింట్లుగా గుర్తించారు. ఈ మేరకు ఆ ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ ఐదురోడ్ల ఎంట్రీ పాయింట్లలో ఐదు కి.మీ ముందు నుంచే మహానాడు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి బృందం సూచించింది. భారీ ఎత్తున జనం రానుండడంతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మహానాడుకు తరలివచ్చేవారికి వసతి, భోజన వసతిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి బహిరంగసభకు వచ్చే నాయకులు, కార్యకర్తలకు గువ్వలచెరువు వద్ద ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను మంత్రి మండిపల్లె రాంప్రసాద్, బీసీ జనార్ధనరెడ్డి పరిశీలించారు. ఇక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు.



మహానాడు ఏర్పాట్లపై ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యేలతో సమీక్షిస్తున్న మంత్రులు

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు : డీజీపీ

మహానాడు వేదికను, అక్కడ చేపట్టనున్న భద్రతా ఏర్పాట్లకు సంబంధించి డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్త పరిశీలించారు. తొలి రెండురోజులు జరిగే ప్రతినిధుల సభ వేదిక, బహిరంగసభ వేదిక, సీఎం బస, సీఎంవో క్యాంపు ఆఫీసు, భోజనశాల, పార్కింగ్ ప్రధాన వేదికలను పరిశీలించారు. పెద్దఎత్తున జనం రానున్న నేపథ్యంలో ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులకు కీలక సూచనలు చేశారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మహానాడుపై సమీక్ష నిర్వహించారు. సీఎం సహా వీఐపీలు వస్తుండటంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. జనాలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌కు ప్రత్యామ్నామార్గాల ద్వారా వెళ్లేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఐజీ ఎన్.మధుసూదన్‌రెడ్డి, కర్నూలు, అనంతపురం రేంజ్ డీఐజీలు కోయ ప్రవీణ్, షమోషీబాజ్‌పేయి కడప, కర్నూలు, అన్నమయ్య, నంద్యాల, అనంతపురం ఎస్పీలు అశోక్‌కుమార్, విక్రాంతపాటిల్, విద్యాసాగర్‌నాయుడు, అధిరాజ్‌సింగ్‌రాణా, జగదీశ్, గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా, అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మహానాడు వేదిక వద్ద మంత్రి నిమ్మల రామానాయుడు, డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్, తదితరులు

ఘనంగా స్నపన తిరుమంజనం



సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న ఆలయ అధికారులు, పూజారులు

ఒంటిమిట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామాలయంలో శనివారం స్నపన తిరుమంజనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేకువజామునే ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ స్వామివారికి పట్టువస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్ మూల విరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని వీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దారు రమణమ్మ, ఆర్‌ఎస్ఎస్ ప్రతినిధి వేణుగోపాల్‌రాజు, టీటీడీ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘోరం..
- లారీ రూపంలో కబళించిన మృత్యువు
- కారుపై పడ్డ లారీ... నలుగురు మృతి..
7

గువ్వలచెరువులో భోజన వసతి ఏర్పాటు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



భోజన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు మండిపల్లి, బీసీ జనార్ధన్‌రెడ్డి తదితరులు

రామాపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడు సందర్భంగా రాయచోటి ప్రాంతం నుంచి వచ్చే దాదాపు లక్ష మంది పైచిలుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు భోజన వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం గువ్వలచెరువు ప్రాంతంలో భోజన వసతులకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కడపలో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు, పుంగనూరు, కుప్పం, పలమనేరు, చిత్తూరు తదితర నియోజకవర్గాల నుంచి లక్ష మంది పైచిలుకు టీడీపీ కుటుంబ సభ్యులు మహానాడుకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. వీరందరికీ భోజన వసతులు పక్కాగా పకడ్బందీగా ఉండాలని నిర్వాహకులకు మంత్రి సూచించారు. వాహన పార్కింగ్‌కు సంబంధించి ప్రత్యేక స్థలం కేటాయించాలన్నారు. ఆయన వెంట రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు చంద్రమౌళి, రేకం ఆంజనేయులు, ఆజాం, హరి, లోకేశ్, ఎంఎల్ వెంకట్రామిరెడ్డి, అంజనరెడ్డి, బండారు తిమ్మారెడ్డి, డాక్టర్ శ్రీను, రమేశ్, కృష్ణయ్య, మహబూబ్‌బాషా, శివయ్య, దేరంగుల శీను, దిలీప్‌కుమార్‌యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపించండి

- సబ్ కలెక్టరేట్‌లో ఎండీయూ ఆపరేటర్ల నిరసన



సబ్‌కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న తంబళ్లపల్లె నియోజకవర్గ ఎండీయూ ఆపరేటర్లు

మదనపల్లె టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లకు ప్రత్యామ్నాయ జీవనం చూపించాలని ఎండీయూ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన ఎండీయూ ఆపరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రతి ఇంటికి వెళ్లి నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తూ ప్రజలకు సేవలందించామన్నారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం ఉన్నపళంగా ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థను రద్దు చేస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. తాము కొనుగోలు చేసిన వాహనాలపై ఉన్న రుణాలు, ఈఎంఐలు ఎవరు చెల్లిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఎండీయూ ఆపరేటర్లను ఆదుకోవాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ డీటీ తనీషాకు వినతిపత్రం అందజేశారు.

హత్యాచారం నిందితుడిని అప్పగించండి

- రోడ్డుపై బైఠాయించి బాధితుల ఆందోళన

జమ్మలమడుగు, మే 24 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె గ్రామంలో చిన్నారిని చిదిమేసిన నిందితుడిని తమకు అప్పగించాలంటూ బాలిక తల్లిదండ్రులు, బంధువులు శనివారం జమ్మలమడుగు పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. వారికి మద్దతుగా జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సింగం శివమోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, వెంకటస్వామి, మర్రిప్రకాశం తదితరులు నిరసన తెలిపారు. అలాగే దళిత ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కోలా ప్రసాద్, స్థానిక సంఘాల నేతలు వీరికి మద్దతు తెలిపారు. చిన్నారి తల్లి మాట్లాడుతూ తమ కుటుంబానికి జరిగిన అన్యాయం ఇతరులకు జరగరాదన్నారు. నిందితుడిని తమకు అప్పగించితే అతడిని నరికేస్తామని, అతడు భూమి మీద బతకరాదని ఆవేదనతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా బాధితులు సుమారు 40 నిమిషాలపాటు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది.

ఈ విషయం తెలిసి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అక్కడకు చేరుకున్నారు. బాధితులంతా ఆయనను చుట్టుముట్టి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. చిన్నారి తండ్రికి ఉద్యోగం ఇస్తామని, ఇంటి స్థలం కేటాయించి ఇల్లు మంజూరు చేస్తామని, ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు అందజేస్తామని తెలిపారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు. కాగా.. ఎస్పీ అశోక్ కుమార్ మైలవరం మండలం ఎ.కంబాలదిన్నెలో ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జమ్మలమడుగుకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఈ దారుణం క్షమించరానిదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు లింగప్ప, గోపాల్‌రెడ్డి, ఎస్ఐలు హైమావతి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ఇతర ప్రాంతాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కలెక్టర్ శ్రీధర్‌ను చుట్టుముట్టిన బాధితులు

రూ.కోట్ల భూమిపై కన్ను



బైపాస్ రోడ్డు పక్కన ఉన్న వివాదాస్పద భూమి

మదనపల్లె శివారులో వివాదాలకు నిలయంగా మారిన బండమీద కమ్మపల్లె (బీకే పల్లె) రెవెన్యూ గ్రామంలో కొన్ని భూములకు సంబంధించిన క్లియరెన్స్ శరవేగంగా సాగుతోంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఉన్నతాధికారుల వరకు అనుకున్న పనులన్నీ చకచకా జరిగిపోతున్నాయి. వివాదాలు, ఇబ్బందులున్నా అధిగమిస్తూ ముందుకెళ్తున్నారు. రెవెన్యూ సిబ్బంది, అధికారులు ఒప్పుకోకుంటే వారిని నయానో, భయానో దారికి తెచ్చుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం రెవెన్యూ శాఖలో ఓ ఉద్యోగి కీలకంగా పనిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు పలుమార్లు వెనక్కి వచ్చినా..ప్రస్తుతం పరిష్కారం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా ఒకటి, రెండు ఫైళ్లే కాదు..పదుల సంఖ్యలో ఈ వరుసలో ఉన్నట్లు చెబుతున్నారు.

- వివరాలు 6లో


- బీకే పల్లెలో మరో భూమాయకు శ్రీకారం
- రికార్డులు తారుమారు చేసి.. విస్తీర్ణం పెంచేసి
- దళారులుగా రెవెన్యూ సిబ్బంది
- వైసీపీ నేతల సిఫార్సుతో ముందుకు
- వివాదం భూమి అధీనంలో ఉన్నట్లు ధ్రువీకరణ
- ఎన్‌వోసీకి రంగం సిద్ధం.. సర్వే రిపోర్టే తరువాయి



రూ.కోట్ల భూమిపై కన్ను



- బీకే పల్లెలో మరో భూమాయకు శ్రీకారం
- రికార్డులు తారుమారు చేసి..విస్తీర్ణం పెంచేసి
- దళారులుగా రెవెన్యూ సిబ్బంది
- వైసీపీ నేతల సిఫార్సుతో ముందుకు
- వివాదం భూమి అధీనంలో ఉన్నట్లు ధ్రువీకరణ
- ఎన్‌వోసీకి రంగం సిద్ధం.. సర్వే రిపోర్టే తరువాయి



సమాచారం హక్కుచట్టం ప్రకారం జారీ చేసిన సర్వేనంబర్లు 531, 538 సర్వే నెంబర్లు, అందులోని విస్తీర్ణం

మదనపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని బీకే పల్లె సర్వే నెంబర్-531-2ఎలో 1.61 ఎకరాలు, 538-1లో 3.38 ఎకరాలు ఓ వ్యక్తికి దరఖాస్తు పట్టా ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఏఎం ఫైల్ నెంబర్-12-19వజేబీ-4-1413, జూలై 2003వ తేదీ 19వ జన్మభూమిలో ఇచ్చినట్లు నంబర్ ఫోర్ రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఆ ఫైలులో సర్వే నెంబర్-538-1లో 3.38 ఎకరాలు, సర్వే నెంబర్-531-2ఏలో 1.61 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో సర్వే నెంబర్-531-2ఏలోని విస్తీర్ణానికి ఇటీవల ఎన్‌వోసీ జారీ చేశారు. అంతవరకూ బాగానే ఉన్నా తర్వాత అదే నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లోని సర్వే నెంబర్-538-1ను మార్పు చేసి సర్వే నెంబర్-552-1గా చూపించినట్లు తెలుస్తోంది. దీనికి కూడా ఎన్‌వోసీ జారీ చేసే క్రమంలో ముందు జరగాల్సిన ప్రక్రియ మొదలుపెట్టారు. అదే వ్యక్తికి ఈ సర్వే నెంబర్‌లో 2.88 ఎకరాల విస్తీర్ణంతో దరఖాస్తు పట్టా ఇచ్చినట్లు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అయితే ఒరిజినల్ ఫైలులో సర్వే నెంబర్-538-1లో 3.38 ఎకరాలు విస్తీర్ణం ఉంటే, దిద్దుబాటు చేసిన నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో 552-1ఏ1లో 2.88 ఎకరాలుగా చూపించారు. కానీ ఎన్‌వోసీ జారీ చేసిన సర్వే నెంబర్-531-2ఏలో 2.11 ఎకరాలు చూపించారు. అంటే ఒరిజినల్ ఫైలులో 1.61 ఎకరాలు ఉంటే, ఎన్‌వోసీ జారీ చేసేటప్పటికి 2.11 ఎకరాలకు అయి 50 సెంట్లు విస్తీర్ణం పెంచేశారు. అంటే సర్వే నెంబర్లు మారినా, దిద్దుబాటు చేసినా..విస్తీర్ణం మాత్రం 4.99 ఎకరాలు వచ్చేలా అక్కడా, ఇక్కడా జాగ్రత్త పడినట్లు స్పష్టమవుతోంది. ఇలా బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కొట్టేసే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆ సమాచారం వెనక్కి ఇవ్వండి

దరఖాస్తుదారుడికి ఇచ్చిన భూమి వివరాలు కావాలని ఓ వ్యక్తి..సమాచార హక్కుచట్టం ప్రకారం వివరాలు అడిగారు. అయితే రెవెన్యూ అధికారులు ఆ సమాచారంతో కూడిన రికార్డు ఇచ్చారు. వీటిని పరిశీలిస్తే ఒరిజినల్ ఫైలులోని సర్వే నెంబర్లు, విస్తీర్ణం, తర్వాత దిద్దిన ఫైలుకు తేడాలు గుర్తించారు. నంబర్ ఫోర్ ఒరిజినల్ స్కాన్డ్ కాపీలో సర్వే నెంబర్లు-531, 538లు ఉండగా, తర్వాత అదే నంబర్ ఫోర్ రిజిస్టర్‌లో సర్వే నెంబర్-538 స్థానంలో 552-1 సర్వే నెంబర్ వచ్చి చేరింది. ఇది పెద్దిరెడ్డి కుటుంబం పేరున రిజిస్ట్రేషన్ అయిన భూమి పక్కనున్న సర్వే నెంబర్. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ రెవెన్యూ ఉద్యోగి విషయం తెలుసుకుని ఆ సమాచారాన్ని వెనక్కి తెప్పించుకుంటున్నారు. ఇందులో ఇబ్బంది పెడితే, తర్వాత నీ సబ్జెట్‌లో ఇబ్బంది పెడతానని బెదిరిస్తున్నట్లు బాధితుడు వాపోతున్నాడు. నిజంగా అదే వ్యక్తికి దరఖాస్తు పట్టా ఇచ్చి ఉంటే సర్వే నెంబర్-531లో భర్త నుంచి భార్య పేరున మ్యుటేషన్ అయినట్లు, సర్వే నెంబర్-552-1లో కూడా ఎందుకు చేయలేదో అధికారులకే తెలియాలి మరి.

మార్పు ఎందుకు చేశారు?

దరఖాస్తు పట్టాలో రెండు సర్వే నెంబర్లతో కూడిన 4.99 ఎకరాలు విస్తీర్ణంతో పట్టా ఇస్తే, ఒక నెంబర్‌ను మాత్రం అలాగే పెట్టి రెండో నెంబర్‌ను మార్పు చేయడం వెనుక అంతర్యం చాలానే ఉన్నట్లు తెలుస్తోంది. మార్పు చేసినట్లుగా కనిపిస్తున్న సర్వే నెంబర్-538లో భూమి లేకపోవడం, ఉన్నా..ఇళ్లు కట్టుకుని చాలామంది పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకోవడం, తదితర కారణాలు ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే ఆ భూమి రోడ్డుకు లోపలవైపున ఉన్నా ఇలాంటి వ్యవహారాలే చేస్తుంటారు. మరోవైపు సర్వే నెంబర్-552-1 బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న విలువైన భూమి కావడం కూడా మార్పునకు కారణంగా చెబుతున్నారు.

పేరు ఒకరిది..ఫలితం మరొకరిది..


దరఖాస్తు పట్టా పొందిన వ్యక్తి స్థానికంగా కాకుండా బయటి ప్రాంతానికి చెందిన వ్యక్తి. అది కూడా ఆయనకు జన్మభూమిలో దరఖాస్తు పట్టా ఇచ్చినట్లు నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో నమోదు చేయగా మాజీ సైనికుడి కోటాలో ఇచ్చినట్లు ఎన్‌వోసీలో చూపించారు. జన్మభూమిలో దరఖాస్తు పట్టా అంటే స్థానికంగా ఉండే వ్యక్తులకే ఇస్తారు..కానీ ఎక్కడో పీలేరు నియోజకవర్గంలో ఉండే వ్యక్తులకు నిబంధనల ప్రకారం ఇవ్వరు. ఇదిలావుండగా, పట్టా ఎవరికో ఇస్తే..వాల్మీకిపురానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ముందుండి నడిపించినట్లు తెలిసింది. వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో అప్పట్లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు ఈ వ్యవహారాన్ని అప్పటి నుంచి ఇప్పటి వరకు నడుపుతున్నట్లు రెవెన్యూ శాఖాధికారులు చెబుతున్నారు.

ఆ ఫైలుపై విచారణ చేస్తున్నాం

ఆ ఫైలుపై క్వెరీ వెసి కలెక్టర్ వెనక్కి పంపారు. సర్వే నెంబర్-552-1 రికార్డులు ఎవరికి ఉన్నాయో పరిశీలిస్తున్నాం. మావి అని వచ్చే వారిని కూడా పిలిపిస్తున్నాం. ఇప్పటికే పంపించిన ఫైలును కలెక్టర్ వెనక్కి పంపించారు. వారం రోజుల్లో విచారించి నివేదిక ఇవ్వమన్నారు. నెంబర్ ఫోర్ రిజిస్టర్ ప్రకారం వివరాలు నమోదు చేసిన, ధ్రువీకరించిన అప్పటి డీటీ రఫిక్ అహ్మద్‌ను కూడా పిలిపించి విచారిస్తున్నాం. అయితే సర్వే నెంబర్-552-1లో 1.70 ఎకరాలు వారి అధీనంలో ఉందని కలెక్టర్ జారీ చేసిన సర్టిఫికెట్‌ను నేను చూడలేదు. ఒకసారి పరిశీలిస్తా.

\- మేఘస్వరూప్, సబ్‌కలెక్టర్, మదనపల్లె


దిద్దుబాటు చేసిన సర్వే నెంబర్-552-1ను పరిశీలిస్తే..


దిద్దిన తర్వాత నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో మారిన సర్వే నెంబర్-552-1ఏ1

సర్వే నెంబర్-552-ఏ1లో 2.88 ఎకరాలు దరఖాస్తు పట్టా పొందినట్లు చూపిస్తున్న ఆ వ్యక్తి 2020లో ఎన్‌వోసీకి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై 2023లో విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు ఆ వ్యక్తికి పట్టా ఇచ్చారని, ఆ భూమి వారి అధీనంలో ఉందని చూపించారు. అయితే క్షేత్రస్థాయిలో ఆ భూమిపై ఆరా తీస్తే ఎన్నో వివాదాలు, ఇబ్బందులు మరెన్నో ఉన్నాయి. పైగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య పేరున ఉన్న భూమి పక్కనే ఉందని చెబుతున్నారు. సర్వే నెంబర్-552-1పార్టులో 1.35 ఎకరాల ప్రభుత్వ భూమిని పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించగా, స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఆ భూమినే ప్రస్తుతం నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో మార్పులు, చేర్పులు చేసిన సర్వే నెంబర్ విస్తీర్ణాన్ని కట్టే బెట్టే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే సగం ప్రక్రియ పూర్తి కాగా, ఇక సర్వేయర్ నుంచి సబ్‌డివిజన్ రిపోర్టు కోసం వేచి ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అంటే పెద్దిరెడ్డి కుటుంబం కబ్జా నుంచి స్వాధీనం చేసుకున్న భూమి ప్రస్తుతానికి అధికారుల ప్రకటనల ప్రకారం ప్రభుత్వ భూమే అయినా..తర్వాత అనుకున్న కార్యాన్ని చక్కబెట్టే ప్రయత్నం జరుగుతున్నట్లు ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది.

ఇది వరకే సర్వే నెంబర్-531లోని విస్తీర్ణానికి ఎన్‌వోసీ పొందిన వ్యక్తే..సర్వే నెంబర్-552-1లో తనకు జారీ చేసిన 2.88 ఎకరాల భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించాలని 2020 అక్టోబరులో దరఖాస్తు చేసుకోగా 2023లో విచారించినట్లు నివేదిక ఇచ్చారు. అయితే 552-1లో 7.28 ఎకరాల విస్తీర్ణం ఉండగా, అది సబ్‌డివిజన్ కాలేదని సూచించారు. అయితే దరఖాస్తుదారుడు మాత్రం 1.70 ఎకరాల్లో అనుభవంలో ఉన్నట్లు చూపించారు. దీనిపై సర్వే చేపట్టి సబ్‌డివిజన్ చేయాలని నివేదిక ఇవ్వాలని, కలెక్టర్, స్థానిక తహసీల్దార్ ధనంజయులును ఆదేశించారు. తహసీల్దార్ ఇచ్చే రిపోర్టు ఆధారంగా ఎన్‌వోసీకి వెళ్లే ప్రయత్నాలు మొదలు పెట్టారు.

హార్సిలీహిల్స్‌లో ఆ..రెస్టారెంట్‌కు గ్రీన్‌సిగ్నల్



హార్సిలీహిల్స్‌లోని వీఎస్సార్ విండ్ వేవ్ రెస్టారెంట్

బి.కొత్తకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లోని లగ్జరీ ప్రైవేటు హోటల్ వీఎస్సార్ విండ్ వేవ్‌కు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. హిల్స్‌పై విలాసవంతమైన భోజనం, విడిది, ఈవెంట్ల నిర్వహణకు కేంద్రమైన ఈ ప్రైవేటు రెస్టారెంట్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందని, ఈ రెస్టారెంట్ మురుగునీరు పర్యాటకులు అధికంగా సంచరించే గాలిబండపైకి వెళుతోందని, వ్యర్థపదార్థాలు, చెత్తను బహిరంగ ప్రదేశంలో వేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ శ్రీధర్ ఆదేశాలతో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ బి.కొత్తకోట తహసీల్దార్ అజారుద్దీన్ చేత ఈనెల 9న సీజ్ చేయించారు. అప్పట్లో ఇది సంచలన నిర్ణయంగా అందరూ భావించారు. కనీసం 15 రోజులు కూడా గడవక ముందే మురుగునీటి నిల్వకు దారి చూపి, వ్యర్థపదార్థాల తరలింపునకు సలహాలిచ్చి సీజ్ చేసిన అధికారుల చేతనే రీ ఓపెనింగ్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. దీంతో శనివారం ఆ రెస్టారెంట్ మళ్లీ ప్రారంభమైంది. ఈ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

పంచాయతీలో అవకతవకలపై విచారణ

ఒంటిమిట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై జమ్మలమడుగు డీఎల్డీవో సుబ్రమణ్యం విచారణ చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై ముందుగా డీఎల్పీవో స్థాయి అధికారి విచారణ చేపట్టారు. విచారణ నివేదిక సక్రమంగా లేదని గుర్తించిన జిల్లా అధికారులు డీఎల్డీవోను నియమించారు. శనివారం డీఎల్డీవో సుబ్రమణ్యం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులు రికార్డులు తమ వద్ద లేవని ముందు విచారణ అధికారిగా ఉన్న ఆయన వద్ద ఉన్నాయని తెలియజేశారు. 27వ తేదీ నుంచి విచారణ ప్రారంభిస్తానని, ఆలోపు రికార్డులను తెప్పించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గౌస్‌బాషా, ఈవోపీఆర్డీ ప్రసాద్, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కారుపై దాడి


దుండగుల దాడితో పగిలిన కారు అద్దం

గుర్రంకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత ఎల్లుట్ల మురళీకృష్ణ కారుపై గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి దాడి చేసి కారు అద్దం ధ్వంసం చేశారు. మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ శీలంవారిపల్లెకు చెందిన ఎస్.మురళీకృష్ణ టీడీపీ మండల నేతగా ఉన్నారు. ఇందులో భాగంగా కడపలో జరగనున్న మహానాడు సభ పనులను పర్యవేక్షించడానికి శుక్రవారం పీలేరు ఎమ్మెల్యే వెళుతుండడంతో ఆయనతో కలిసి వెళ్లారు.

అక్కడ నుంచి తిరిగి గుర్రంకొండకు వచ్చి స్వగ్రామానికి వెళ్లడానికి ఇంటి నుంచి కారు తీసుకురావాలని బావమరిది రెడ్డిశేఖర్‌కు సూచించారు. రెడ్డిశేఖర్ కారులో శీలంవారిపల్లె నుంచి గుర్రంకొండకు వస్తుండగా మార్గమధ్యంలోని సంగసముద్రం పంచాయతీ పరిధిలోని కంకరమిషన్ వద్దకు రాగానే గుర్తు తెలియని దుండగులు కారుపై దాడి చేశారు. దుండగుల దాడిలో కారు ముందు అద్దం ధ్వంసమైంది. కారు లోపల కారం పొడి కూడా చల్లారు. ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్‌గా వచ్చిన రెడ్డిశేఖర్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో రాత్రికి రాత్రే పోలీసులు దాడిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ఉదయాన్నే దాడి జరిగిన ప్రదేశంలో ఫోన్ కాల్స్ డంప్, సీడీఆర్‌ఎస్ వివరాలను సేకరించే పనులను పోలీసులు ముమ్మరం చేశారు.

ఈ నేపథ్యంలో కారు డ్రైవర్‌గా వచ్చిన రెడ్డిశేఖర్‌తో దాడి జరిగిన తీరుపై పోలీసులు వివరాలను ఆరా తీశారు. ఈ దాడి ఏ కోణంలో జరిగిందోనన్ని పలు కోణాల్లో పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో కేసును చేధించి నిందితులను పట్టుకుంటామని ఎస్‌ఐ రఘురాం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శేషప్పనాయుడు (ఫైల్)

తంబళ్లపల్లె/పెద్దమండ్యం మే 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. పెద్దమండ్యం మండలం ముసలికుంట పంచాయతీ గోనుపోతుల పల్లెకు చెందిన శేషప్పనాయుడు (32) ఇటీవల కువైత్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం భార్య అపర్ణతో కలసి మదనపల్లెకు వెళ్లి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తన అత్తకు ఆపరేషన్ చేయించాడు. అక్కడి నుంచి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళ్తుండగా తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె ఆర్చి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. కాగా మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో టైలరింగ్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులపై శిక్షణ పొందేందుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, టీవో నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందన్నారు. 15 నుంచి 45 ఏళ్ల లోపు మహిళలు ఈనెల 29 లోగా స్కిల్ హబ్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ చౌడయ్య నెం:9618655759 నెంబరులో సంప్రదించాలని కోరారు.

దాడి కేసు నమోదు

బి.కొత్తకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో తన దాయాదిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని గోళ్లపల్లెలో చిల్లరదుకాణం నడుపుకుంటున్న వీరప్ప (42)పై అతని దాయాది వెంకటేశ్వర (45) శనివారం దాడి చేసి గాయపరిచాడు. అడ్డు వచ్చిన తన భార్య విజయలక్ష్మి, తండ్రి నారాయణను దూషించడంతో పాటు బెదిరించాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బి.కొత్తకోట పోలీసులు తెలిపారు.

రేపటి లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలి

రాజంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు దగ్గరగా ఉన్న ఐటీఐల్లో ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఆర్.రఘురామిరెడ్డి తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకోకపోతే మెరిట్ లిస్టులో పేరు ఉండదని, కావున ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

మద్యం మత్తులో దాడి: ఒకరికి తీవ్రగాయాలు


గాయపడ్డ పోకల అరవింద్

రైల్వేకోడూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు యువకులు ఘర్షణ పడటంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.... రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలోని మద్యం షాపు సమీపంలో రైల్వేకోడూరు పట్టణానికి చెందిన పోకల అరవింద్, రైల్వేకోడూరు పట్టణంలోని అంకమ్మనగర్‌కు చెందిన పగడాల రామక్రిష్ణతేజ కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో మద్యం బాటిల్‌తో పోకల అరవింద్‌పై రామక్రిష్ణతేజ దాడి చేయడంతో అరవింద్ మెడపై తీవ్ర గాయమైంది. అరవింద్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

కాగా రామక్రిష్ణతేజను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడి గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ హేమసుందర్ తెలిపారు.

సమన్వయ లోపం...నిర్మాణాల్లో జాప్యం

- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపంతో నత్తనడకన ఆర్వోబీల పనులు ● కోర్టు కేసులతో చిత్తూరు మార్గంలో అడ్డంకులు ● స్థల సేకరణ, ట్రాఫిక్ సమస్యలతో మదనపల్లె ఆర్వోబీ ఆలస్యం


రాత్రి పూట గడ్డర్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం


రైల్వే క్రాసింగ్ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు

పీలేరు/పీలేరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం కారణంగానే పీలేరులో జరుగుతున్న ఆర్వోబీల నిర్మాణ పనుల్లో విపరీతమైన ఆలస్యం జరుగుతోంది. వంతెనల నిర్మాణానికి సహకరించాల్సిన శాఖలు, వాటి అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండడంతో వాటి ఫలితం నిర్మాణ పనులపై పడుతోంది. పీలేరులో సాగుతున్న ఆర్వోబీల నిర్మాణ తీరుపై ఈనెల 20వ తేదీ 'ఎన్నాళ్లీ ఈ యాతన' అన్న శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై ఎన్‌హెచ్ అధికారులు స్పందించారు. ఆర్వోబీల నిర్మాణాల్లో తమకు ఎదురవుతున్న సమస్యలను సమగ్రంగా వివరించారు. కోర్టు కేసుల కారణంగా చిత్తూరు మార్గంలో పనులు ఆలస్యం అవుతుండగా, స్థల సేకరణ, ట్రాఫిక్ కారణంగా మదనపల్లె మార్గంలో పనులు ఆలస్యంగా సాగుతున్నట్లు ఎన్‌హెచ్ ఏఈ మాధవన్ తెలిపారు.

వ్యవస్థలో లోపాలకు సాక్ష్యంగా సర్వే నెం-93


పీలేరు-చిత్తూరు మార్గంలోని రైల్వే క్రాసింగ్ సమీపంలో ఉన్న సర్వే నెం.93 ప్రభుత్వ వ్యవస్థల్లోని లోపాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రభుత్వ రికార్డుల్లో ఆ సర్వే నెంబరు పూర్తిగా ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నప్పటికీ గతంలో ఆ సర్వే నెంబరులోని భూమిపై కొనుగోళ్లు జరిగాయి. ఆ కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించి పీలేరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయో అప్పటి అధికారులకే తెలియాలి. ఆ రిజిస్ట్రేషన్ల ఆధారంగా ఆ సర్వే నెంబరులో ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసిన 12 మంది హైకోర్టును ఆశ్రయించారు. తాము కొనుగోలు చేసిన భూమికి పరిహారం చెల్లించాలని వారు కోర్టును ఆశ్రయించగా, భూమి ప్రభుత్వానిదే అయినప్పుడు పరిహారం ఎలా చెల్లిస్తామని ఎన్‌హెచ్, రెవెన్యూ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఆ భూముల్లో కట్టుకున్న భవనాలకు పరిహారం చెల్లించినందున వెంటనే వాటిని ఖాళీ చేయాలని ఎన్‌హెచ్ అధికారులు కోరుతుండగా భవన యజమానులు కోర్టును ఆశ్రయించడంతో ఆ మార్గంలో పనులు నిలిచిపోయాయి. పీలేరు-చిత్తూరు మార్గంలోని రైల్వే క్రాసింగ్‌పై చేపట్టిన ఆర్వోబీ పనులు కోర్టు కేసుల కారణంగా పూర్తిగా స్తంభించిపోయాయి. ఆర్వోబీ నిర్మాణానికి ఆయువుపట్టు లాంటి సర్వే నెం93లో స్థల సేకరణపై కోర్టు కేసు నడుస్తుండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

రైల్వే క్రాసింగ్ మార్పు కోసం...

మదనపల్లె మార్గంలోని రైల్వే క్రాసింగ్‌ను మార్చాల్సి రావడంతో ఇక్కడ కూడా పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఆర్వోబీ నిర్మాణం కోసం రైల్వే క్రాసింగ్‌ను మార్చాల్సి ఉంది. ఆ మార్పునకు అనుగుణంగా స్థల సేకరణ చేయాల్సి రావడంతో వాటి కారణంగా పనులు ఆలస్యం అయ్యాయి. అయితే ఇక్కడ కేవలం ఒక ఇంటి కారణంగా పనులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది.

స్థల సేకరణ జరిపిన ఓ ఇంటిపై ఆ భవన యజమానికి, విద్యుత శాఖాధికారుల మధ్య వివాదం నెలకొంది. తమకు రావాల్సిన బకాయిలు వచ్చేంత వరకు ఆ ఇంటిని కూల్చొద్దని విద్యుత్ శాఖాధికారులు ఎన్‌హెచ్ అధికారులపై ఒత్తిడి తేవడంతో వారు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అంతేకాకుండా మదనపల్లె-తిరుపతి మార్గంలో నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉండడం వల్ల పగటిపూట తాము పనులు చురుగ్గా చేయలేకున్నామని, స్థానిక అధికారులు పూనుకుని ట్రాఫిక్‌ను కొత్తగా నిర్మితమై అందుబాటులోకి వచ్చిన బైపాస్ మార్గం గూండా మళ్లించాలని బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్లు కోరుతున్నారు. వారి అభ్యర్థన కార్యరూపం దాల్చకపోవడంతో వారు కేవలం రాత్రి పూట మాత్రమే పనులు సాగిస్తున్నారు. భారీ క్రేన్ల సాయంతో గడ్డర్లు బిగించాల్సి ఉండడంతో ప్రాణనష్టం భయంతో వారు రాత్రిళ్లు ఆ పనులు కొనసాగిస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి



ఆర్వోబీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులతో ఒక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయాలి. ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించడంతోపాటు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు టాస్క్‌ఫోర్స్ సహాయకారిగా ఉం టుంది. పనుల్లో ఆలస్యం కారణంగా ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న ఆర్వోబీలను ప్రజలే వద్దనుకునే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి.

\-గోపీనాథ్ రెడ్డి, విశ్రాంత ఎస్‌ఈ

అడ్డంకులు తొలగితే ఆరు నెలల్లో పూర్తి

పీలేరులోని రెండు ఆర్వోబీలకు ఉన్న న్యాయ, రెవెన్యూ, విద్యుత్ అడ్డంకులు తొలగిపోతే కేవలం ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తాం. పనులను త్వరిగతగతిన పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని వసతులు సిద్ధంగా ఉన్నాయి. కేవలం కోర్టు కేసుల కారణంగా పనుల్లో ఆలస్యం జరుగుతోంది. ముందరి కాళ్లకు బంధం వేసి పరుగెత్తమని కోరినట్లు ఉంది మా పరిస్థితి. క్షేత్రస్థాయిలోని అడ్డంకులు తొలగకుండా మేం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇదే విషయాన్ని స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధికారులకు కూడా నివేదించాం. కోర్టు కేసులను త్వరలోనే ఒక కొలిక్కి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు జేసీ తెలిపారు.

\- మాధవన్, ఏఈ, నేషనల్ హైవేస్



నలుగురిని బలిగొన్న లారీ

ఘోరం

● కారుపై పడ్డ లారీ... నుజ్జునుజ్జు అయిన కారు

- లారీ రూపంలో కబళించిన మృత్యువు
- నలుగురుమృతి.. శోకసంద్రంలో మూడు పల్లెలు
- గువ్వలచెరువు ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- సొంతూరులో జాతరకు వస్తూ అనంతలోకాలకు
- భార్యాభర్తల ఆఖరిప్రయాణం..
- మృత్యువులో వీడని అక్కా తమ్ముడి బంధం

బద్వేలుటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు చిత్తూరు జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ వద్ద శనివారం ఉదయం కారుపై లారీ బోల్తాకొట్టడంతో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. ఈ ఘటనలో బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన దంపతులు బసినేని శ్రీకాంత్‌రెడ్డి(32), భార్య బసినేని శిరీష(30).. బి.కోడూరు మండలం గంగిరెడ్డిపల్లెకు చెందిన అక్కాతమ్ముడు పి.సాయి హర్షిణి(11), రిషికేశ్ రెడ్డి(9) మృతిచెందారు. శశికళ, స్వర్ణలతలకు తీవ్రగాయాలు అయ్యాయి. మూడేళ్ల చిన్నారి రిషికకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా..

బద్వేలు మండలం చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన బసినేని మల్లికార్జునరెడ్డి, సుజాతమ్మలకు ఇద్దరు కుమారులు. వారిలో ఒకరు బద్వేలు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు. రెండవ కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, అతని భార్య శిరీష, మూడేళ్ల కూతురు రిషికతో కలసి బెంగళూరులో ఉంటున్నారు. దంపతులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరు స్వగ్రామంలో జరిగే మండలపూజకు బంధువులతో కలసి మొత్తం ఏడుగురు కారులో వస్తుండగా.. మార్గమధ్యంలోని గువ్వలచెరువు ఘాట్ వద్ద రెప్పపాటులో వెనక వస్తున్న లారీ కారుపై పడింది. దీంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో బసినేని శ్రీకాంత్‌రెడ్డి, అతడి భార్య బసినేని శిరీష, బి.కోడూరు మండలం గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి, శశికళ దంపతుల కుమార్తె, కుమారుడు సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డి మృతిచెందారు. ఇదే ఘటనలో గాయపడ్డ శశికళ, బి.కోడూరు మండలం మేకవారిపల్లెకు చెందిన స్వర్ణ, రిషికను కడప రిమ్స్‌కు తరలించారు.





కారులోంచి దంపతులు శిరీష, శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాలను వెలికి తీస్తున్న దృశ్యం

మమ్మీ లే మమ్మీ... డాడీ లే డాడీ

తల్లిదండ్రులు బసినేని శిరీష, బసినేని శ్రీకాంత్ రెడ్డి విగతజీవులుగా పడి ఉండటం చూసి దిక్కుతోచని స్థితిలో చిన్నారి త్రిషిక గడిపిన తీరు అక్కడివారిని కలచివేసింది. మమ్మీ లే మమ్మీ.. డాడీ లే డాడీ.. అంటూ ఏడుస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. తన తల్లిదండ్రులు ఇక రారనీ, తనను విడిచి శాశ్వతంగా వెళ్లిపోయారని తెలియని స్థితిలో చిన్నారిపడిన వేదన అంతా ఇంతా కాదు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన రితేశ్‌రెడ్డి

విషయం తెలుసుకున్న బద్వేలు టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేశ్‌కుమార్ రెడ్డి హుటాహుటిన కడప రిమ్స్‌కు చేరుకుని ముందుగా క్షతగాత్రులను పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులను, కలెక్టర్‌ను కోరారు. అనంతరం మార్చురీకి వెళ్లి మృతదేహాలను సందర్శించి వెంటనే పోస్టుమార్టం చేయాలని వైద్యులను కోరారు. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఆయనతో పాటు డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి వారిని పరామర్శించారు. అలాగే బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ కడప రిమ్స్‌కు చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

ఒకే ఒక్క ప్రమాదం..
చిన్నారికి తల్లిదండ్రులను దూరం చేసింది...
ఒకే ఒక్క ప్రమాదం కొడుకు కోడలిని దూరం చేసింది..
ఒకే ఒక్క దుర్ఘటన..
తల్లిదండ్రులకు కొడుకు కూతుళ్లను దూరం చేసింది.
గువ్వలచెరువు ఘటన వద్ద రహదారిపై రక్తం, కన్నీరు కలసి ప్రవహించాయి. రెప్పపాటున జరిగిన ప్రమాదంలో నాలుగు ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. మృతులంతా బంధువులే.. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చింతపుత్తాయపల్లెలో ఆలయం మండలపూజ ఉంది. అలాగే మృతిచెందిన శ్రీకాంత్, శిరీష కుమార్తె రిషిక పుట్టెంట్రుకలు తీసే కార్యక్రమం ఉంది. ఈ రెండు శుభకార్యాలను చేసుకునేందుకు సొంతగ్రామానికి వస్తుండగా మృత్యువు కబళించింది. దీంతో మూడు గ్రామాల్లో తీవ్రశోకాన్ని నింపింది.



మృతిచెందిన శిరీష, శ్రీకాంత్‌రెడ్డిల ఫైల్‌ఫొటో

గంగిరెడ్డిపల్లెలో విషాదం

బి.కోడూరు మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కోగటం తిరుపతి రెడ్డి, శశికళ దంపతులు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జీవిస్తుండేవారు. వారికి సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డి పిల్లలు. 20 రోజులక్రితం ఉద్యోగరీత్యా తిరుపతిరెడ్డి జర్మనీ వెళ్లారు. చింతపుత్తాయపల్లెలో ఆదివారం జరిగే ఆలయ మండలపూజలో పాల్గొనేందుకు బంధువులతో కలిసి వస్తుండగా వీరి కారు గువ్వలచెరువు ఘాట్‌లో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో శశికళ ప్రాణాలతో బయటపడగా తన కుమార్తె, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో గంగిరెడ్డిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న తిరుపతిరెడ్డి జర్మనీ నుంచి బయల్దేరినట్లు బంధువులు తెలిపారు.

భగవంతుడా... మేమేం పాపం చేశాము



రిషికేశ్‌రెడ్డి ఫైల్ ఫొటో



సాయిహర్షిణి ఫైల్ ఫొటో

గువ్వల చెరువు రోడ్డు ప్రమాదంలో తల్లి ఎదుటే చిన్నారులు సాయిహర్షిణి(11), రిషికేశ్‌రెడ్డి(9) మృతిచెందడంతో "దేవుడా మేమేం పాపం చేశాము.. మాకు ఎందుకు ఇంత అన్యాయం చేశావు.. కంటికి రెప్పలా కాపాడుకుంటున్న నా బిడ్డలను నాకు నాకు ఎందుకు దూరం చేశావ్.. నా బాధ ఎవరికి చెప్పుకోవాలి" అంటూ అక్కడ కళ్లెదుటే బిడ్డలను కోల్పోయిన తల్లి శశికళ ఆవేదన అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.



అక్కాతమ్ముడు సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డిల మృతదేహాలు

ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలి

● మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని ఉపా..ధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో జరిగిన సంఘ ముఖ్య నాయకుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలోనే ఉపాధ్యా యుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకై ఉపాధ్యాయ సంఘ నాయ కులు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రపతి ఆమోదం కూడా పొందిన విషయాన్ని గుర్తు చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం ద్వారా విద్యారంగం బలోపేతం కావడంతో పాటు ఏళ్లతరబడి పదో న్నతులకు నోచుకోని ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పదోన్నతులు పొందు తారని, జాప్యం లేకుండా అమలుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంతో కాలంగా తాము డిమాండ్ చేసిన శాశ్వత టీచర్ల బదిలీల చట్టం అమలులోకి తేవడం హర్షణీయమన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్ బాష, ప్రధాన కార్యదర్శి ఎస్.సంగ మేశ్వరరెడ్డి, జిల్లా మున్సిపల్ కన్వీనర్ వై.అనిల్‌కుమార్, జిల్లా నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు



డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీనివాసరాజు

కడప ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీ లను ఎటువంటి అనుమానాలకు, అవాంతరాలకు తావులే కుండా అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, కడప జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణం రాజు జిల్లా విద్యాశాఖాధికారులను కోరారు. శనివారం వివిధ సమస్యలపై నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కడప, అన్నమయ్య జిల్లా విద్యా శాఖ అధికారులు షేక్ షంషుద్దీన్, సుబ్రమణ్యంలను వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఆదేశానుసారం మాన్యువల్ కౌన్సిలింగ్ జరుగుతున్నందున ఉపాధ్యాయులు ఎవరు అసౌకర్యానికి గురి కాకుండా అన్ని వసతులతో నిర్ణీత సమయంలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బదిలీల ప్రక్రియ నిర్వహణలో తలెత్తే సమస్య లను ఎప్పటికప్పుడు పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, వి.వేణుగోపాల్‌రావు, ఎన్‌టీఏ నాయకులు మురళీమోహన్‌రాజు, కట్ట గంగాధర్, వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పేరు మార్పుపై అభ్యంతరాలు నిల్

కడప, మే 24 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ జిల్లాగా ఉన్న పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ ఇటీవల ప్రభుత్వం మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుంది. అభ్యంతరాల కోసం 30 రోజుల గడువు విధించగా.. ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. కడప అనేది ఎంతో ప్రాచీనమైన, చరిత్ర గల పేరు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలకు తొలిగడప కడప అని ఇలాంటి ప్రాచీనమైన చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అయితే రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కడప జిల్లాపై తన మార్కును చాటుకున్నారు. ఆయన మరణానంతరం వైఎస్సార్ జిల్లాగా మార్చారు. అయితే జిల్లాలో కడప పేరు తీసేయడాన్ని జిల్లావాసులు ఎవరు జీర్ణించుకోలేకపోయారు. తిరుమల తొలిగడప కడపను జిల్లా పేరు నుంచి తీసేయడాన్ని సహించలేకపోయారు. ఈ నేపథ్యంలో జనం నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు వైసీపీ హయాంలో నిరసనలు, అభ్యంతరాలు వచ్చాయి. అయితే జగన్ పట్టించుకోలేదు. అయితే ప్రజల మనోభావాల కారణంగా ఇటీవల సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన మంత్రి మండలిలో జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ గెజిట్ విడుదల చేస్తూ అభ్యంతరాలపై 30రోజులు గడువు ఇచ్చింది. అయితే గడువు పూర్తయినప్పటికీ కూడా పేరు మార్పుపై ఒక్క అభ్యంతరం కూడా రాకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో సోమవారం వైఎస్సార్ కడప జిల్లాగా అధికారిక ఉత్తర్వులు జారీ అవుతాయని తెలుస్తోంది.

28 నుంచి ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన

● నూజివీడు క్యాంపస్‌లో ఏర్పాట్లు

వేంపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో ప్రత్యేక కేటగిరీ విభాగంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 28వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్రకుమార్ సండ్ర ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీన క్యాప్, స్పోర్ట్స్, 29న క్యాప్, బీఎస్‌జీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరీ, 30వ తేదీన ఎన్‌సీసీ, స్పోర్ట్స్, 31వ తేదీన ఎన్‌సీసీ కింద దరఖాస్తు చేసుకున్న ఆయా విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు.

ఇప్పటికే ఆయా విద్యార్థులకు సమాచారం ఇచ్చామని, నూజివీడు క్యాంపస్‌లో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కేటగిరీలో క్యాప్ 270, బీఎస్‌జీ 247, ఎన్‌సీసీ 1,454, స్పోర్ట్స్ 1,032 మంది హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన సేవలందించడమే ధ్యేయం

● రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ

కడప మారుతీనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడమే ధ్యేయమని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఏదేని స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ పనుల విషయంగా నగరానికి కాస్త దూరంగా బుద్ధ టౌన్‌షిప్‌లో గల తమ కార్యాలయానికి రావాలంటే ప్రజలు ఒకింత అసౌకర్యానికి గురౌతున్నట్లు తెలిసిందన్నారు. ఆ లోటులేకుండా నగర నడిబొడ్డుగా భావించే పాత రిమ్స్‌లో ప్రభుత్వం 15 సెంట్ల స్థలాన్ని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి కేటాయించిందన్నారు. ఆ మేరకు శనివారం పాత రిమ్స్ వద్ద రిజిస్ట్రేషన్ సముదాయ భవనానికి కేటాయించిన స్థలంలో శిలావలకానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఇర్విన్, దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్, నగర అధ్యక్షుడు యు.సంజీవరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఓబులేసు, ఏపీ సబ్ రిజిస్ట్రార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అబీ జుల్లా, జిల్లా రిజి స్ట్రార్ బాబు తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద అధికారులు

ముగ్గురు దొంగలు అరెస్టు

● బంగారు, వెండి నగలు స్వాధీనం

ఖాజీపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేటలోని వీఎస్ జ్యువెలరీ షాపులో చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసి, బంగారు వెండి నగలను స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఖాజీపేట పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఖాజీపేటలో గతనెల 12వ తేదీ వీఎస్ జ్యువెలరీ షాపులో చోరీకి పాల్పడిన నిందితులు శనివారం ఉదయం కడప ఇర్కాన్ సర్కిల్‌లో ఉన్నారని సీఐకి వచ్చిన సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎర్రగొళ్ల బసవరాజు, కె.సంజీవప్ప, యల్లప్పలను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా జ్యువెలరీ షాపులో దొంగతనంతోపాటు మరో రెండు చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు జతల కమ్మలు, ఉంగరం, కాళ్ల గొలుసులు, వెండి మెట్టెలు, వెండి ప్లేట్లు, వెండి దీపాలు, కుంకుమ భరిణె స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీ కేసును చేధించి నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. కాగా, చోరీల నియంత్రణకు దుకాణాదారులు, ఇంటి యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు. ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి, సిబ్బంది సుధాకర్, తిరుమలయ్య, శివగణేష్, అమరేశ్వరరెడ్డి, నవీన్‌కుమార్, హోంగార్డు బాబు తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐ

టీటీడీ లీగల్ కౌన్సిల్‌గా జీఎస్ మూర్తి



జీఎస్ మూర్తి

కడప రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ మూర్తిని తిరుమల తిరుపతి దేవస్థానం లీగల్ కౌన్సిల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన 1983 నుంచి టీడీపీలో కీలక కార్యకర్తగా పనిచేస్తూ పలు హోదాలలో పనిచేశారు. ఇదివరకు వరుసగా మూడు పర్యాయాలు జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నారు. పలు కీలక కేసులలో విజయం సాధించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జిల్లాలోని నాయకులకు, కార్యకర్తలకు న్యాయపరమైన సేవలు అందించారు. క్రిమినల్ కేసులలో పోలీస్ అధికారులకు న్యాయసలహాదారుగా పనిచేశారు. ఈయన సేవలను గుర్తించిన టీడీపీ అధిష్టానం టీటీడీ లీగల్ సెల్ కౌన్సిల్‌గా నియమించింది.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

బోటుమీదపల్లె వీఆర్ఏ మృతి

ఓబులవారిపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బోటుమీదపల్లె వీఆర్ఏ మహబూబ్‌బాషా(57) ఆకస్మిక మృతిచెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

వైభవంగా యల్లమ్మ తిరునాళ్లు

పుల్లంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపల్లె అగ్రహారంలో శనివారం యల్లమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు.శనివారం హోమం చేపట్టి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం గ్రామోత్సవ నిర్వహించారు. ఆదివారం పొంగుబాళ్లు పెట్టి మొక్కులు తీర్చుకుంటారు.

మహాభారతానికి విరాళం

చిన్నమండెం, మే24(ఆంధ్రజ్యోతి): మల్లూరు గ్రామంలోని కొత్తపల్లె మలూరమ్మ గుడి వద్ద జరుగుతున్న మహాభరతం కార్యక్రమానికి రాహుల్‌రెడ్డి రూ.11 వేలు విరాళంగా అందజేశారు. మల్లూరమ్మ ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని రాహుల్‌రెడ్డి అమ్మవారిని వేడుకున్నారు.

మారెమ్మ, కాళికమ్మలకు పూజలు

సుండుపల్లె, మే24(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవతలైన మారెమ్మ తల్లి, కాళికాదేవిలకు శనివారం పూజలు నిర్వహించినట్లు భక్తులు తెలిపారు. మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ మిట్టబిడికి సమీపంలో కుడికాలువ గట్టుపై వెలిసిన అమ్మవారి ఆలయంలో ప్రతి ఏటా తిరునాళ్ల వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు వారు తెలిపారు.

రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా




మినీ మహానాడు కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి.. కార్యక్రమానికి హాజరైన టీడీపీ శ్రేణులు

- 9 నెలల్లోనే రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం
- వెలిగల్లు రిజర్వాయర్ నుంచి ఆరు మండలాలకు తాగునీరు అందిస్తాం
- గాలివీడులో జరిగిన మినీ మహానాడులో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, మే24(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం గాలివీడు మండలంలోని శ్రీనాథ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులు దగా పడ్డారని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుద్యోగ యువతకు శాశ్వత ఉద్యోగ అవకావలు కల్పించాలనే లక్ష్యంతో 14,400 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలను అమలు చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో తాగునీటి సమస్యను గాలికొదిలేయగా కూటమి అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే నియోజకవర్గంలో రూ.20 కోట్లతో 300 బోర్లను వేశామన్నారు. మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఆరు మండలాల్లోని 750 గ్రామాలకు తాగునీరు అందించడానికి రూ.300 కోట్లతో త్వరలోనే టెండర్లకు వస్తాయన్నారు. రూ.600 కోట్లతో 29 ఆర్ అండ్‌బీ రహదారుల అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. హంద్రీ-నీవా, శ్రీనివాసపురం రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తి చేయడానికి రూ.300 కోట్లు అభివృద్ధి నిధులు మంజరయ్యాయని, ఈ పనులు పూర్తి అయితే చిన్నమండెం, సంబేపల్లె, రాయచోటి రూరల్ మండలాల్లోని 25 వేల ఎకరాలు వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా గాలివీడు మండలంలోని అన్ని చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించడానికి ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే చేపడతామన్నారు. రాయచోటి ప్రభుత్వ వైద్యశాలలో రూ.29 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్లు మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.45 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణలు పూర్తయ్యాయని, ఆరు కోట్లతో సాంఘిక సంక్షేమ పథకాల వసతి గృహాల అభివృద్ధి పనులు చేపట్టామని, ఆరు కోట్లతో నాబార్డు పథకం ద్వారా వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు.

మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఈ నెల 27, 28, 29వ తేదీల్లో కడపలో ఎంతో ప్రతిష్టాత్మకంగా మహానాడు కార్యక్రమాన్ని చేపపడుతున్నారని, విజయవంతం చేయాలని మంత్రి మండిపల్లి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఆరు మండలాలకు సంబంధించిన మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి

- కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి



మహానాడు సభావేదికను పరిశీలిస్తున్న ముక్కా, పంతగాని

రైల్వేకోడూరు, మే 24(ఆంధ్ర జ్యోతి): కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆ యన కడపలో మహానాడు వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానాడు ఏర్పాట్లు చివరి దశకు చే రుకున్నాయన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మం త్రులు నిమ్మల రామానాయుడు, సంధ్యారాణి, అనగాని సత్యప్రసాద్ ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి మహానాడుకు పదివేల మం ది కార్యకర్తలు తరలి వెళ్లేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, కస్తూరి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన ఏర్పాటుకు వినతి

సిద్దవటం, మే 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మాచుపల్లె, ఖాదర్‌బంగ్లా వద్ద పెన్నానదిపై వంతెన నిర్మాణ పనులకు మహానాడులో తీర్మానం చేయాలని శనివారం సిద్దవటం మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆ పార్టీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు జ్యోతి జగదీశ్వర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: మంత్రి

చిన్నమండెం, మే24(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మిద్దామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిజమైన పేదలను గుర్తించి వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజల అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే పరిష్కరింపజేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బాలక్రిష్ణంరాజు

రైల్వేకోడూరు, మే 24(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరి ష్క రిం చా లని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈ) అధ్యక్షుడు ఎస్.ఇస్మాయిల్, అసోసియేట్ ప్రెసిడెంట్ బాలక్రిష్ణంరాజు తెలిపారు. శనివారం రైల్వేకోడూరు పట్టణంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏలు, అరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూన్ 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యదర్శి గల్లా రమణ, వైస్ ప్రెసిడెంట్ గురుమహేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ మూర్తిని సన్మానించిన కొమరా



మూర్తిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఒంటిమిట్ట, మే 24 (ఆంధ్ర జ్యోతి): తిరుమల-తిరుపతి దేవస్థానం స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపికైన సీనియర్ న్యాయవాది జీఎస్ మూర్తిని రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య ఘనంగా సన్మానించారు. జీఎస్ మూర్తి నియాకంపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పార్టీలో పనిచేస్తూ న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న నాయకులకు, కార్యకర్తలకు తాను ఉన్నానంటూ జిల్లా కోర్టులోనే కాకుండా హైకోర్టులో కూడా తన వాదనను వినిపించిన మహోన్నత వ్యక్తి జీఎస్ మూర్తి అన్నారు. ఆయన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టీటీడీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యునిగా నియమించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నందలూరు మండల టీడీపీ అధ్యక్షులు సుబ్బయ్య, ఒంటిమిట్ట పార్టీ సీనియర్ నాయకులు పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ఒంటిమిట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమాచుపల్లె పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు రావడంతో అధికారులు విచారణ నిర్వహించారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని కొండమాచుపల్లెకు చెందిన ఆలూరు వెంకటసుబ్బయ్య ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. జంగిల్ క్లీనింగ్ పేరుతో లక్షలాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం విచారణ అధికారిగా శ్రీధర్ హాజరయ్యారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివనారాయణ, కార్యదర్శి చంద్ర, ఆలూరు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంజననది రక్షణగోడ దీక్షకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న తులసిరెడ్డి

రైల్వేకోడూరు, మే 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా స్పోక్స్‌పర్సన్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ గుంజన నదికి రక్షణగోడ నిర్మించాలంటూ చేపట్టిన దీక్షకు సీఐటీయూ, వైసీపీ నాయకులతో పాటు రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తులసిరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా గుంజననదికి రక్షణ గోడ లేక వర్షాలు కురిసినప్పుడల్లా పేదల ఇళ్లు కూలుతున్నాయ న్నారు. రక్షణగోడ చేపట్టకపోతే ఆమరణ దీక్షలు చేయాల్సి వస్తుందన్నారు. పది రోజుల్లో పనులు మొదలు పెడతామని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా దీక్షలు విరమించారు. కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గోశాల దేవి, సీనియర్ నాయకులు కదిగాళ్ల శాంతయ్య, మదనపల్లె ఇన్‌చార్జ్ రెడ్డి సాహెబ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

31న సౌమ్యనాథస్వామి ఆలయంలో యోగాంధ్ర

నందలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి):సౌమ్యనాథస్వామి ఆలయంలో ఈనెల 31న ఉదయం 8 గంటలకు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా టూరిజం అధికారి నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 21న జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ అందాలి

సిద్దవటం, మే 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ అందాలని తహసీల్దారు తిరుమల బాబు అన్నారు. శనివారం సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో రేషన్‌షాపు డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీలో సమ సయపాలన పాటించాలన్నారు.

డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి

రామాపురం, మే24(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ రామాంజులు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. వికలాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి సరుకులు పంపిణీ చేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడి

రాయచోటిటౌన్, మే24(ఆంధ్రజ్యోతి): భూమి ఆరోగ్యంతో పాటు అధిక దిగుబడి ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని మాస్టర్ ట్రైనర్ చిన్నరెడ్డెన్న అన్నారు. శనివారం రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు క్లస్టర్‌లోని యండపల్లిలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ జీ. చిన్నరెడ్డెన్న, యూనిట్ ఇన్‌చార్జి హరిబాబు, వెంకటరమణమ్మ, వీఏఏ కిరణ్‌రాజు, సీసీ ప్రేమ నారాయణల ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బోయపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి గ్రామ సభ ఏర్పాటు చేశారు.

లక్కిరెడ్డిపల్లె: ఈడిగపల్లెలో శనివారం ప్రకృతి వ్యవసాయ యాక్షన్ ప్లాన్ 2025లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మద్దిరేవుల సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, వీహెచ్‌ఏ లావణ్య, మార్కెటింగ్ ఎంటీ రవికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి: సీపీఐ

రాయచోటిటౌన్, మే24(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధి కోసం భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన రాయచోటి పట్టణంలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నేతలు పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి కరపత్రాలను విడుదల చేశారు.

యోగాతో ఆరోగ్యకర జీవితం

వీరబల్లి, మే24(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యకర జీవితం సాగించవచ్చునని మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి, ఎంపీడీవో నూర్జహాన్, వైద్యాధికారి మనీషాలు అన్నారు. వీరబల్లిలోని మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో వారు అంగన్వాడీ, సచివాలయాల సిబ్బంది యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు యోగా విధిగా అలవర్చుకోవాలన్నారు. యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. పూర్వీకులు ఇచ్చిన ఆస్తి యోగా అని కొనియాడారు. కార్యక్రమంలో వెలుగు సీసీ ఖాదర్‌వలి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనానరు.

'ప్రాణహాని ఉంది... రక్షించండి'

రాయచోటి టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి):తమ కుటుంబానికి గ్రామానికి చెందిన మురళీకృష్ణ నుంచి ప్రాణహాని ఉందని అదే గ్రామానికి చెందిన నక్కల బాలకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. మండలంలోని ఎల్లుట్ల పంచాయితీ శీలం వారిపల్లెకు చెందిన ఎస్. మురళీకృష్ణ కుటుంబానికి అదే గ్రామానికి చెందిన బాలకృష్ణ కుటుంబానికి కొన్ని రోజులుగా పాతకక్షలున్నాయి. ఈ క్రమంలో మురళీకృష్ణ తమపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందిపెడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా మురళీకృష్ణ గ్రామానికి చెందిన పలువురు నుంచి సొమ్ము తీసుకొన్నారని, సొమ్ము అడిగిన వారిపై దురుసుగా ప్రవర్తిస్తునట్లు తెలిపారు. ఈ క్రమంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమ కుటుంబ సభ్యులపై తప్పుడు ప్రచారం చేస్తూ, ఇబ్బందులకు గురిచేస్తునట్లు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో కలిసి వినవించుకున్నారు.

నాటుసారా స్వాధీనం ఒకరి అరెస్టు

రైల్వేకోడూరు, మే 24(ఆంధ్ర జ్యోతి): ఓబులవారిపల్లె మండలంలోని వైకోట గ్రామానికి చెందిన బొబ్బే సుబ్బయ్య అనే వ్యక్తి శనివారం నాటు సారా విక్రయిస్తుండగా రైల్వేకోడూరు ఎక్సైజ్‌శాఖ సీఐ తులసి, సిబ్బంది దాడులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బయ్యను అరెస్టు చేసి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబు ళ్లు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, బసిరెడ్డి, మధుసూదన్‌రాజు, పీ.సోమేశ్వర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

సిద్దవటం, మే 24 (ఆంధ్ర జ్యోతి): కడపాయపల్లె, టక్కోలి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పీడీ ఆదిశేషారెడ్డి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో నరసింహులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

మహానాడు ఏర్పాట్లను పరిశీలించిన రాజంపేట నేతలు



మహానాడు పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

రాజంపేట, మే 24 (ఆంధ్ర జ్యోతి):కడపలో జరిగే మహానాడు ఏర్పాట్లను శనివారం రాజంపేటకు చెందిన టీడీపీ నేతలు జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు టి.సంజీవరాయుడు, బి.వెంకటేశ్వర్లునాయుడు, డి.వెంకటరమణనాయుడు, డాక్టర్ నవీన్‌కుమార్, పి.చంద్రనాయుడు పరిశీలించారు. మంత్రి రామానాయుడు, చంద్రగిరి ఎ మ్మెల్యే పులిపర్తి నాని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్‌లను కలిసి పలు విషయాలపై చర్చించారు. మహానాడు సభలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించండి

సిద్దవటం, మే 24 (ఆంధ్రజ్యోతి) : వాతావరణం మార్పుల వల్ల జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వస్తాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి తెలిపారు. మండలంలోని మూలపల్లెలో శనివారం 104 వైద్య శిబిరంలో రోగులకు చికిత్సలు అందించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

రేపు నిత్యపూజేశ్వరస్వామి హుండీ లెక్కింపు

సిద్దవటం, మే 24 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వర ఆలయం హుండీ లెక్కింపు మే 26న నిత్యపూజేశ్వరకోనలో చేపట్టనున్నారరు. ఈ మేరకు ఆలయ ఈవో శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలి



మాట్లాడుతున్న ఈవో వరప్రసాద్‌రావు


రైల్వేకోడూరు, మే 24(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలని రైల్వేకోడూరు గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి దండే ప్ర సాద్ రావు తెలిపారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో ఏ ర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశం సర్పంచ్ బుడిగి శివయ్య అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రసాద్ రావు మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల సహకారంతో కోడూరును అభివృద్ధి పథంలో నడిపిద్దామన్నారు. జూన్ 1 నుంచి ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై గట్టి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పారిశుధ్య సమస్య పరిష్కారానికి 25 మంది కార్మికులను ఔట్‌సోర్సింగ్ కింద తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్పంచ్ బుడిగి శివయ్య మాట్లాడుతూ చెత్త తరలింపునకు మరో రెండు ట్రాక్టర్లు, రెండు ఆటోలను తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం 1 వార్డు సభ్యుడు పో తురాజు నవీన్, 3వ వార్డు సభ్యుడు నార్జాల హేమరాజ్ మాట్లాడుతూ వర్షం కురిసినప్పుడు మెయిన్‌రోడ్డులో ప్రజలు ఇబ్బంది ప డుతున్నారని. డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చే సి చిట్వేలి రోడ్డులో కలిపి వేయాలని కోరారు. 17వ వార్డు సభ్యుడు వైఎస్ కరిముల్లా మాట్లాడుతూ పంచాయతీ నిధులతో కొత్త సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. 8వ వార్డు సభ్యురాలు పోకల సుజాత మాట్లాడుతూ తన వార్డులోకి సక్రమంగా పారిశుధ్య కార్మికులు రావడం లేదన్నారు. 12వ వార్డు సభ్యుడు నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తన వార్డును నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.దీంతో పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం లో ఎందుకు పనులు కేటాయించకోలేదని, కూటమి ప్రభుత్వంపై అభివృద్ధి జరగలేదని నిందలు వేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ ను ధీర్, జూనియర్ అసిస్టెంట్ వీణా,ఉప సర్పంచ్ తోట శివసాయి, వార్డు సభ్యులు పోకల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



రూ.కోట్ల భూమిపై కన్ను



- బీకే పల్లెలో మరో భూమాయకు శ్రీకారం
- రికార్డులు తారుమారు చేసి..విస్తీర్ణం పెంచేసి
- దళారులుగా రెవెన్యూ సిబ్బంది
- వైసీపీ నేతల సిఫార్సుతో ముందుకు
- వివాదం భూమి అధీనంలో ఉన్నట్లు ధ్రువీకరణ
- ఎన్‌వోసీకి రంగం సిద్ధం.. సర్వే రిపోర్టే తరువాయి



సమాచారం హక్కు చట్టం ప్రకారం జారీ చేసిన సర్వేనంబర్లు 531, 538 సర్వే నెంబర్లు, అందులోని విస్తీర్ణం

మదనపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని బీకే పల్లె సర్వే నెంబర్-531-2ఏలో 1.61 ఎకరాలు, 538-1లో 3.38 ఎకరాలు ఓ వ్యక్తికి దరఖాస్తు పట్టా ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఏఎం ఫైల్ నెంబర్-12-19వజేబీ-4-1413, జూలై 2003వ తేదీ 19వ జన్మభూమిలో ఇచ్చినట్లు నంబర్ ఫోర్ రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఆ ఫైలులో సర్వే నెంబర్-538-1లో 3.38 ఎకరాలు, సర్వే నెంబర్-531-2ఏలో 1.61 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో సర్వే నెంబర్-531-2ఏలోని విస్తీర్ణానికి ఇటీవల ఎన్‌వోసీ జారీ చేశారు. అంతవరకూ బాగానే ఉన్నా తర్వాత అదే నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లోని సర్వే నెంబర్-538-1ను మార్పు చేసి సర్వే నెంబర్-552-1గా చూపించినట్లు తెలుస్తోంది. దీనికి కూడా ఎన్‌వోసీ జారీ చేసే క్రమంలో ముందు జరగాల్సిన ప్రక్రియ మొదలుపెట్టారు. అదే వ్యక్తికి ఈ సర్వే నెంబర్‌లో 2.88 ఎకరాల విస్తీర్ణంతో దరఖాస్తు పట్టా ఇచ్చినట్లు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అయితే ఒరిజినల్ ఫైలులో సర్వే నెంబర్-538-1లో 3.38 ఎకరాలు విస్తీర్ణం ఉంటే, దిద్దుబాటు చేసిన నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో 552-1ఏ1లో 2.88 ఎకరాలుగా చూపించారు. కానీ ఎన్‌వోసీ జారీ చేసిన సర్వే నెంబర్-531-2ఏలో 2.11 ఎకరాలు చూపించారు. అంటే ఒరిజినల్ ఫైలులో 1.61 ఎకరాలు ఉంటే, ఎన్‌వోసీ జారీ చేసేటప్పటికి 2.11 ఎకరాలకు అయి 50 సెంట్లు విస్తీర్ణం పెంచేశారు. అంటే సర్వే నెంబర్లు మారినా, దిద్దుబాటు చేసినా..విస్తీర్ణం మాత్రం 4.99 ఎకరాలు వచ్చేలా అక్కడా, ఇక్కడా జాగ్రత్త పడినట్లు స్పష్టమవుతోంది. ఇలా బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కొట్టేసే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆ సమాచారం వెనక్కి ఇవ్వండి

దరఖాస్తుదారుడికి ఇచ్చిన భూమి వివరాలు కావాలని ఓ వ్యక్తి..సమాచార హక్కుచట్టం ప్రకారం వివరాలు అడిగారు. అయితే రెవెన్యూ అధికారులు ఆ సమాచారంతో కూడిన రికార్డు ఇచ్చారు. వీటిని పరిశీలిస్తే ఒరిజినల్ ఫైలులోని సర్వే నెంబర్లు, విస్తీర్ణం, తర్వాత దిద్దిన ఫైలుకు తేడాలు గుర్తించారు. నంబర్ ఫోర్ ఒరిజినల్ స్కాన్డ్ కాపీలో సర్వే నెంబర్లు-531, 538లు ఉండగా, తర్వాత అదే నంబర్ ఫోర్ రిజిస్టర్‌లో సర్వే నెంబర్-538 స్థానంలో 552-1 సర్వే నెంబర్ వచ్చి చేరింది. ఇది పెద్దిరెడ్డి కుటుంబం పేరున రిజిస్ట్రేషన్ అయిన భూమి పక్కనున్న సర్వే నెంబర్. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ రెవెన్యూ ఉద్యోగి విషయం తెలుసుకుని ఆ సమాచారాన్ని వెనక్కి తెప్పించుకుంటున్నారు. ఇందులో ఇబ్బంది పెడితే, తర్వాత నీ సబ్జెట్‌లో ఇబ్బంది పెడతానని బెదిరిస్తున్నట్లు బాధితుడు వాపోతున్నాడు. నిజంగా అదే వ్యక్తికి దరఖాస్తు పట్టా ఇచ్చి ఉంటే సర్వే నెంబర్-531లో భర్త నుంచి భార్య పేరున మ్యుటేషన్ అయినట్లు, సర్వే నెంబర్-552-1లో కూడా ఎందుకు చేయలేదో అధికారులకే తెలియాలి మరి.

మార్పు ఎందుకు చేశారు?

దరఖాస్తు పట్టాలో రెండు సర్వే నెంబర్లతో కూడిన 4.99 ఎకరాలు విస్తీర్ణంతో పట్టా ఇస్తే, ఒక నెంబర్‌ను మాత్రం అలాగే పెట్టి రెండో నెంబర్‌ను మార్పు చేయడం వెనుక అంతర్యం చాలానే ఉన్నట్లు తెలుస్తోంది. మార్పు చేసినట్లుగా కనిపిస్తున్న సర్వే నెంబర్-538లో భూమి లేకపోవడం, ఉన్నా..ఇళ్లు కట్టుకుని చాలామంది పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకోవడం, తదితర కారణాలు ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే ఆ భూమి రోడ్డుకు లోపలవైపున ఉన్నా ఇలాంటి వ్యవహారాలే చేస్తుంటారు. మరోవైపు సర్వే నెంబర్-552-1 బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న విలువైన భూమి కావడం కూడా మార్పునకు కారణంగా చెబుతున్నారు.

పేరు ఒకరిది..ఫలితం మరొకరిది..

దరఖాస్తు పట్టా పొందిన వ్యక్తి స్థానికంగా కాకుండా బయటి ప్రాంతానికి చెందిన వ్యక్తి. అది కూడా ఆయనకు జన్మభూమిలో దరఖాస్తు పట్టా ఇచ్చినట్లు నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో నమోదు చేయగా మాజీ సైనికుడి కోటాలో ఇచ్చినట్లు ఎన్‌వోసీలో చూపించారు. జన్మభూమిలో దరఖాస్తు పట్టా అంటే స్థానికంగా ఉండే వ్యక్తులకే ఇస్తారు..కానీ ఎక్కడో పీలేరు నియోజకవర్గంలో ఉండే వ్యక్తులకు నిబంధనల ప్రకారం ఇవ్వరు. ఇదిలావుండగా, పట్టా ఎవరికో ఇస్తే..వాల్మీకిపురానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ముందుండి నడిపించినట్లు తెలిసింది. వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో అప్పట్లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు ఈ వ్యవహారాన్ని అప్పటి నుంచి ఇప్పటి వరకు నడుపుతున్నట్లు రెవెన్యూ శాఖాధికారులు చెబుతున్నారు.

ఆ ఫైలుపై విచారణ చేస్తున్నాం


ఆ ఫైలుపై క్వోరీ వెసి కలెక్టర్ వెనక్కి పంపారు. సర్వే నెంబర్-552-1 రికార్డులు ఎవరికి ఉన్నాయో పరిశీలిస్తున్నాం. మావి అని వచ్చే వారిని కూడా పిలిపిస్తున్నాం. ఇప్పటికే పంపించిన ఫైలును కలెక్టర్ వెనక్కి పంపించారు. వారం రోజుల్లో విచారించి నివేదిక ఇవ్వమన్నారు. నెంబర్ ఫోర్ రిజిస్టర్ ప్రకారం వివరాలు నమోదు చేసిన, ధ్రువీకరించిన అప్పటి డీటీ రఫిక్ అహ్మద్‌ను కూడా పిలిపించి విచారిస్తున్నాం. అయితే సర్వే నెంబర్-552-1లో 1.70 ఎకరాలు వారి అధీనంలో ఉందని కలెక్టర్ జారీ చేసిన సర్టిఫికెట్‌ను నేను చూడలేదు. ఒకసారి పరిశీలిస్తా.

- మేఘస్వరూప్, సబ్‌కలెక్టర్, మదనపల్లె

దిద్దుబాటు చేసిన సర్వే నెంబర్-552-1ను పరిశీలిస్తే..

సర్వే నెంబర్-552-ఏ1లో 2.88 ఎకరాలు దరఖాస్తు పట్టా పొందినట్లు చూపిస్తున్న ఆ వ్యక్తి 2020లో ఎన్‌వోసీకి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై 2023లో విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు ఆ వ్యక్తికి పట్టా ఇచ్చారని, ఆ భూమి వారి అధీనంలో ఉందని చూపించారు. అయితే క్షేత్రస్థాయిలో ఆ భూమిపై ఆరా తీస్తే ఎన్నో వివాదాలు, ఇబ్బందులు మరెన్నో ఉన్నాయి. పైగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య పేరున ఉన్న భూమి పక్కనే ఉందని చెబుతున్నారు. సర్వే నెంబర్-552-1పార్టులో 1.35 ఎకరాల ప్రభుత్వ భూమిని పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించగా, స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఆ భూమినే ప్రస్తుతం నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో మార్పులు, చేర్పులు చేసిన సర్వే నెంబర్ విస్తీర్ణాన్ని కట్టే బెట్టే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే సగం ప్రక్రియ పూర్తి కాగా, ఇక సర్వేయర్ నుంచి సబ్‌డివిజన్ రిపోర్టు కోసం వేచి ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అంటే పెద్దిరెడ్డి కుటుంబం కబ్జా నుంచి స్వాధీనం చేసుకున్న భూమి ప్రస్తుతానికి అధికారుల ప్రకటనల ప్రకారం ప్రభుత్వ భూమే అయినా..తర్వాత అనుకున్న కార్యాన్ని చక్కబెట్టే ప్రయత్నం జరుగుతున్నట్లు ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది.

ఇది వరకే సర్వే నెంబర్-531లోని విస్తీర్ణానికి ఎన్‌వోసీ పొందిన వ్యక్తే..సర్వే నెంబర్-552-1లో తనకు జారీ చేసిన 2.88 ఎకరాల భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించాలని 2020 అక్టోబరులో దరఖాస్తు చేసుకోగా 2023లో విచారించినట్లు నివేదిక ఇచ్చారు. అయితే 552-1లో 7.28 ఎకరాల విస్తీర్ణం ఉండగా, అది సబ్‌డివిజన్ కాలేదని సూచించారు. అయితే దరఖాస్తుదారుడు మాత్రం 1.70 ఎకరాల్లో అనుభవంలో ఉన్నట్లు చూపించారు. దీనిపై సర్వే చేపట్టి సబ్‌డివిజన్ చేయాలని నివేదిక ఇవ్వాలని, కలెక్టర్, స్థానిక తహసీల్దార్ ధనంజయులును ఆదేశించారు. తహసీల్దార్ ఇచ్చే రిపోర్టు ఆధారంగా ఎన్‌వోసీకి వెళ్లే ప్రయత్నాలు మొదలు పెట్టారు.



దిద్దిన తర్వాత నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో మారిన సర్వే నెంబర్-552-1ఏ1

హార్సిలీహిల్స్‌లో ఆ..రెస్టారెంట్‌కు గ్రీన్‌సిగ్నల్

బి.కొత్తకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లోని లగ్జరీ ప్రైవేటు హోటల్ వీఎస్సార్ విండ్ వేవ్‌కు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. హిల్స్‌పై విలాసవంతమైన భోజనం, విడిది, ఈవెంట్ల నిర్వహణకు కేంద్రమైన ఈ ప్రైవేటు రెస్టారెంట్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందని, ఈ రెస్టారెంట్ మురుగునీరు పర్యాటకులు అధికంగా సంచరించే గాలిబండపైకి వెళుతోందని, వ్యర్థపదార్థాలు, చెత్తను బహిరంగ ప్రదేశంలో వేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ శ్రీధర్ ఆదేశాలతో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ బి.కొత్తకోట తహసీల్దార్ అజారుద్దీన్ చేత ఈనెల 9న సీజ్ చేయించారు. అప్పట్లో ఇది సంచలన నిర్ణయంగా అందరూ భావించారు. కనీసం 15 రోజులు కూడా గడవక ముందే మురుగునీటి నిల్వకు దారి చూపి, వ్యర్థపదార్థాల తరలింపునకు సలహాలిచ్చి సీజ్ చేసిన అధికారుల చేతనే రీ ఓపెనింగ్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. దీంతో శనివారం ఆ రెస్టారెంట్ మళ్లీ ప్రారంభమైంది. ఈ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



హార్సిలీహిల్స్‌లోని వీఎస్సార్ విండ్ వేవ్ రెస్టారెంట్

పంచాయతీలో అవకతవకలపై విచారణ

ఒంటిమిట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై జమ్మలమడుగు డీఎల్‌డీవో సుబ్రమణ్యం విచారణ చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై ముందుగా డీఎల్పీవో స్థాయి అధికారి విచారణ చేపట్టారు. విచారణ నివేదిక సక్రమంగా లేదని గుర్తించిన జిల్లా అధికారులు డీఎల్డీవోను నియమించారు. శనివారం డీఎల్డీవో సుబ్రమణ్యం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులు రికార్డులు తమ వద్ద లేవని ముందు విచారణ అధికారిగా ఉన్న ఆయన వద్ద ఉన్నాయని తెలియజేశారు. 27వ తేదీ నుంచి విచారణ ప్రారంభిస్తానని, ఆలోపు రికార్డులను తెప్పించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గౌస్‌బాషా, ఈవోపీఆర్డీ ప్రసాద్, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కారుపై దాడి

గుర్రంకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత ఎల్లుట్ల మురళీకృష్ణ కారుపై గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి దాడి చేసి కారు అద్దం ధ్వంసం చేశారు. మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ శీలంవారిపల్లెకు చెందిన ఎస్.మురళీకృష్ణ టీడీపీ మండల నేతగా ఉన్నారు. ఇందులో భాగంగా కడపలో జరగనున్న మహానాడు సభ పనులను పర్యవేక్షించడానికి శుక్రవారం పీలేరు ఎమ్మెల్యే వెళుతుండడంతో ఆయనతో కలిసి వెళ్లారు.

అక్కడ నుంచి తిరిగి గుర్రంకొండకు వచ్చి స్వగ్రామానికి వెళ్లడానికి ఇంటి నుంచి కారు తీసుకురావాలని బావమరిది రెడ్డిశేఖర్‌కు సూచించారు. రెడ్డిశేఖర్ కారులో శీలంవారిపల్లె నుంచి గుర్రంకొండకు వస్తుండగా మార్గమధ్యంలోని సంగసముద్రం పంచాయతీ పరిధిలోని కంకరమిషన్ వద్దకు రాగానే గుర్తు తెలియని దుండగులు కారుపై దాడి చేశారు. దుండగుల దాడిలో కారు ముందు అద్దం ధ్వంసమైంది. కారు లోపల కారం పొడి కూడా చల్లారు. ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్‌గా వచ్చిన రెడ్డిశేఖర్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో రాత్రికి రాత్రే పోలీసులు దాడిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ఉదయాన్నే దాడి జరిగిన ప్రదేశంలో ఫోన్ కాల్స్ డంప్, సీడీఆర్ఎస్ వివరాలను సేకరించే పనులను పోలీసులు ముమ్మరం చేశారు.

ఈ నేపథ్యంలో కారు డ్రైవర్‌గా వచ్చిన రెడ్డిశేఖర్‌తో దాడి జరిగిన తీరుపై పోలీసులు వివరాలను ఆరా తీశారు. ఈ దాడి ఏ కోణంలో జరిగిందోనన్ని పలు కోణాల్లో పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో కేసును ఛేదించి నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ రఘురాం తెలిపారు.



దుండగుల దాడితో పగిలిన కారు అద్దం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తంబళ్లపల్లె/పెద్దమండ్యం మే 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. పెద్దమండ్యం మండలం ముసలికుంట పంచాయతీ గోనుపోతులపల్లెకు చెందిన శేషప్పనాయుడు (32) ఇటీవల కువైత్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం భార్య అపర్ణతో కలసి మదనపల్లెకు వెళ్లి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తన అత్తకు ఆపరేషన్ చేయించాడు. అక్కడి నుంచి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళ్తుండగా తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె ఆర్చి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. కాగా మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



శేషప్పనాయుడు (ఫైల్)

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో టైలరింగ్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులపె శిక్షణ పొందేందుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, టీవో నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందన్నారు. 15 నుంచి 45 ఏళ్ల లోపు మహిళలు ఈనెల 29 లోగా స్కిల్ హబ్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ చౌడయ్య నెం:9618655759 నెంబరులో సంప్రదించాలని కోరారు.

దాడి కేసు నమోదు

బి.కొత్తకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో తన దాయాదిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని గోళ్లపల్లెలో చిల్లరదుకాణం నడుపుకుంటున్న వీరప్ప (42)పై అతని దాయాది వెంకటేశ్వర (45) శనివారం దాడి చేసి గాయపరిచాడు. అడ్డు వచ్చిన తన భార్య విజయలక్ష్మి, తండ్రి నారాయణను దూషించడంతో పాటు బెదిరించాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బి.కొత్తకోట పోలీసులు తెలిపారు.

రేపటి లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలి

రాజంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు దగ్గరగా ఉన్న ఐటీఐల్లో ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఆర్.రఘురామిరెడ్డి తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకోకపోతే మెరిట్ లిస్టులో పేరు ఉండదని, కావున ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

మద్యం మత్తులో దాడి: ఒకరికి తీవ్రగాయాలు

రైల్వేకోడూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు యువకులు ఘర్షణ పడటంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.... రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలోని మద్యం షాపు సమీపంలో రైల్వేకోడూరు పట్టణానికి చెందిన పోకల అరవింద్, రైల్వేకోడూరు పట్టణంలోని అంకమ్మనగర్‌కు చెందిన పగడాల రామక్రిష్ణతేజ కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో మద్యం బాటిల్‌తో పోకల అరవింద్‌పై రామక్రిష్ణతేజ దాడి చేయడంతో అరవింద్ మెడపై తీవ్ర గాయమైంది. అరవింద్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

కాగా రామక్రిష్ణతేజను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడి గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ హేమసుందర్ తెలిపారు.



గాయపడ్డ పోకల అరవింద్

సమన్వయ లోపం...నిర్మాణాల్లో జాప్యం

● ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపంతో నత్తనడకన ఆర్వోబీల పనులు ● కోర్టు కేసులతో చిత్తూరు మార్గంలో అడ్డంకులు ● స్థల సేకరణ, ట్రాఫిక్ సమస్యలతో మదనపల్లె ఆర్వోబీ ఆలస్యం

పీలేరు/పీలేరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం కారణంగానే పీలేరులో జరుగుతున్న ఆర్వోబీల నిర్మాణ పనుల్లో విపరీతమైన ఆలస్యం జరుగుతోంది. వంతెనల నిర్మాణానికి సహకరించాల్సిన శాఖలు, వాటి అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండడంతో వాటి ఫలితం నిర్మాణ పనులపై పడుతోంది. పీలేరులో సాగుతున్న ఆర్వోబీల నిర్మాణ తీరుపై ఈనెల 20వ తేదీ 'ఎన్నాళ్లీ ఈ యాతన' అన్న శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై ఎన్‌హెచ్ అధికారులు స్పందించారు. ఆర్వోబీల నిర్మాణాల్లో తమకు ఎదురవుతున్న సమస్యలను సమగ్రంగా వివరించారు. కోర్టు కేసుల కారణంగా చిత్తూరు మార్గంలో పనులు ఆలస్యం అవుతుండగా, స్థల సేకరణ, ట్రాఫిక్ కారణంగా మదనపల్లె మార్గంలో పనులు ఆలస్యంగా సాగుతున్నట్లు ఎన్‌హెచ్ ఏఈ మాధవన్ తెలిపారు.



రాత్రి పూట గడ్డర్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



రైల్వే క్రాసింగ్ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు

వ్యవస్థలో లోపాలకు సాక్ష్యంగా సర్వే నెం-93

పీలేరు-చిత్తూరు మార్గంలోని రైల్వే క్రాసింగ్ సమీపంలో ఉన్న సర్వే నెం.93 ప్రభుత్వ వ్యవస్థల్లోని లోపాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రభుత్వ రికార్డుల్లో ఆ సర్వే నెంబరు పూర్తిగా ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నప్పటికీ గతంలో ఆ సర్వే నెంబరులోని భూమిపై కొనుగోళ్లు జరిగాయి. ఆ కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించి పీలేరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయో అప్పటి అధికారులకే తెలియాలి. ఆ రిజిస్ట్రేషన్ల ఆధారంగా ఆ సర్వే నెంబరులో ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసిన 12 మంది హైకోర్టును ఆశ్రయించారు. తాము కొనుగోలు చేసిన భూమికి పరిహారం చెల్లించాలని వారు కోర్టును ఆశ్రయించగా, భూమి ప్రభుత్వానిదే అయినప్పుడు పరిహారం ఎలా చెల్లిస్తామని ఎన్‌హెచ్, రెవెన్యూ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఆ భూముల్లో కట్టుకున్న భవనాలకు పరిహారం చెల్లించినందున వెంటనే వాటిని ఖాళీ చేయాలని ఎన్‌హెచ్ అధికారులు కోరుతుండగా భవన యజమానులు కోర్టును ఆశ్రయించడంతో ఆ మార్గంలో పనులు నిలిచిపోయాయి. పీలేరు-చిత్తూరు మార్గంలోని రైల్వే క్రాసింగ్‌పై చేపట్టిన ఆర్వోబీ పనులు కోర్టు కేసుల కారణంగా పూర్తిగా స్తంభించిపోయాయి. ఆర్వోబీ నిర్మాణానికి ఆయువుపట్టు లాంటి సర్వే నెం93లో స్థల సేకరణపై కోర్టు కేసు నడుస్తుండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

రైల్వే క్రాసింగ్ మార్పు కోసం...

మదనపల్లె మార్గంలోని రైల్వే క్రాసింగ్‌ను మార్చాల్సి రావడంతో ఇక్కడ కూడా పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఆర్వోబీ నిర్మాణం కోసం రైల్వే క్రాసింగ్‌ను మార్చాల్సి ఉంది. ఆ మార్పునకు అనుగుణంగా స్థల సేకరణ చేయాల్సి రావడంతో వాటి కారణంగా పనులు ఆలస్యం అయ్యాయి. అయితే ఇక్కడ కేవలం ఒక ఇంటి కారణంగా పనులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది.

స్థల సేకరణ జరిపిన ఓ ఇంటిపై ఆ భవన యజమానికి, విద్యుత శాఖాధికారుల మధ్య వివాదం నెలకొంది. తమకు రావాల్సిన బకాయిలు వచ్చేంత వరకు ఆ ఇంటిని కూల్చొద్దని విద్యుత్ శాఖాధికారులు ఎన్‌హెచ్ అధికారులపై ఒత్తిడి తేవడంతో వారు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అంతేకాకుండా మదనపల్లె-తిరుపతి మార్గంలో నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉండడం వల్ల పగటిపూట తాము పనులు చురుగ్గా చేయలేకున్నామని, స్థానిక అధికారులు పూనుకుని ట్రాఫిక్‌ను కొత్తగా నిర్మితమై అందుబాటులోకి వచ్చిన బైపాస్ మార్గం గూండా మళ్లించాలని బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్లు కోరుతున్నారు. వారి అభ్యర్థన కార్యరూపం దాల్చకపోవడంతో వారు కేవలం రాత్రి పూట మాత్రమే పనులు సాగిస్తున్నారు. భారీ క్రేన్ల సాయంతో గడ్డర్లు బిగించాల్సి ఉండడంతో ప్రాణనష్టం భయంతో వారు రాత్రిళ్లు ఆ పనులు కొనసాగిస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి



ఆర్వోబీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులతో ఒక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయాలి. ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించడంతోపాటు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు టాస్క్‌ఫోర్స్ సహాయకారిగా ఉం టుంది. పనుల్లో ఆలస్యం కారణంగా ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న ఆర్వోబీలను ప్రజలే వద్దనుకునే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి.

-గోపీనాథ్ రెడ్డి, విశ్రాంత ఎస్ఈ

అడ్డంకులు తొలగితే ఆరు నెలల్లో పూర్తి

పీలేరులోని రెండు ఆర్వోబీలకు ఉన్న న్యాయ, రెవెన్యూ, విద్యుత్ అడ్డంకులు తొలగిపోతే కేవలం ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తాం. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని వసతులు సిద్ధంగా ఉన్నాయి. కేవలం కోర్టు కేసుల కారణంగా పనుల్లో ఆలస్యం జరుగుతోంది. ముందరి కాళ్లకు బంధం వేసి పరుగెత్తమని కోరినట్లు ఉంది మా పరిస్థితి. క్షేత్రస్థాయిలోని అడ్డంకులు తొలగకుండా మేం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇదే విషయాన్ని స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధికారులకు కూడా నివేదించాం. కోర్టు కేసులను త్వరలోనే ఒక కొలిక్కి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు జేసీ తెలిపారు.

- మాధవన్, ఏఈ, నేషనల్ హైవేస్



నలుగురిని బలిగొన్న లారీ

ఘోరం

● కారుపై పడ్డ లారీ... నుజ్జునుజ్జు అయిన కారు

- లారీ రూపంలో కబళించిన మృత్యువు
- నలుగురుమృతి.. శోకసంద్రంలో మూడు పల్లెలు
- గువ్వలచెరువు ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- సొంతూరులో జాతరకు వస్తూ అనంతలోకాలకు
- భార్యాభర్తల ఆఖరిప్రయాణం..
- మృత్యువులో వీడని అక్కాతమ్ముడి బంధం

ఒకే ఒక్క ప్రమాదం..
చిన్నారికి తల్లిదండ్రులను దూరం చేసింది...
ఒకే ఒక్క ప్రమాదం కొడుకు కోడలిని దూరం చేసింది..
ఒకే ఒక్క దుర్ఘటన..
తల్లిదండ్రులకు కొడుకు కూతుళ్లను దూరం చేసింది.
గువ్వలచెరువు ఘటన వద్ద రహదారిపై రక్తం, కన్నీరు కలసి ప్రవహించాయి. రెప్పపాటున జరిగిన ప్రమాదంలో నాలుగు ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. మృతులంతా బంధువులే.. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చింతపుత్తాయపల్లెలో ఆలయం మండలపూజ ఉంది. అలాగే మృతిచెందిన శ్రీకాంత్, శిరీష కుమార్తె రిషిక పుట్టెంట్రుకలు తీసే కార్యక్రమం ఉంది. ఈ రెండు శుభకార్యాలను చేసుకునేందుకు సొంతగ్రామానికి వస్తుండగా మృత్యువు కబళించింది. దీంతో మూడు గ్రామాల్లో తీవ్రశోకాన్ని నింపింది.



మృతిచెందిన శిరీష, శ్రీకాంత్‌రెడ్డిల ఫైల్‌ఫొటో




కారులోంచి దంపతులు శిరీష, శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాలను వెలికి తీస్తున్న దృశ్యం

బద్వేలుటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు చిత్తూరు జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ వద్ద శనివారం ఉదయం కారుపై లారీ బోల్తాకొట్టడంతో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. ఈ ఘటనలో బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన దంపతులు బసినేని శ్రీకాంత్‌రెడ్డి(32), భార్య బసినేని శిరీష(30).. బి.కోడూరు మండలం గంగిరెడ్డిపల్లెకు చెందిన అక్కాతమ్ముడు పి.సాయి హర్షిణి(11), రిషికేశ్ రెడ్డి(9) మృతిచెందారు. శశికళ, స్వర్ణలతలకు తీవ్రగాయాలు అయ్యాయి. మూడేళ్ల చిన్నారి రిషికకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా..

బద్వేలు మండలం చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన బసినేని మల్లికార్జునరెడ్డి, సుజాతమ్మలకు ఇద్దరు కుమారులు. వారిలో ఒకరు బద్వేలు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు. రెండవ కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, అతని భార్య శిరీష, మూడేళ్ల కూతురు రిషికతో కలసి బెంగళూరులో ఉంటున్నారు. దంపతులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరు స్వగ్రామంలో జరిగే మండలపూజకు బంధువులతో కలసి మొత్తం ఏడుగురు కారులో వస్తుండగా.. మార్గమధ్యంలోని గువ్వలచెరువు ఘాట్ వద్ద రెప్పపాటులో వెనక వస్తున్న లారీ కారుపై పడింది. దీంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో బసినేని శ్రీకాంత్‌రెడ్డి, అతడి భార్య బసినేని శిరీష, బి.కోడూరు మండలం గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి, శశికళ దంపతుల కుమార్తె, కుమారుడు సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డి మృతి చెందారు. ఇదే ఘటనలో గాయపడ్డ శశికళ, బి.కోడూరు మండలం మేకవారిపల్లెకు చెందిన స్వర్ణ, రిషికను కడప రిమ్స్‌కు తరలించారు.

మమ్మీ లే మమ్మీ... డాడీ లే డాడీ

తల్లిదండ్రులు బసినేని శిరీష, బసినేని శ్రీకాంత్ రెడ్డి విగతజీవులుగా పడి ఉండటం చూసి దిక్కుతోచని స్థితిలో చిన్నారి త్రిషిక గడిపిన తీరు అక్కడివారిని కలచివేసింది. మమ్మీ లే మమ్మీ.. డాడీ లే డాడీ.. అంటూ ఏడుస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. తన తల్లిదండ్రులు ఇక రారనీ, తనను విడిచి శాశ్వతంగా వెళ్లిపోయారని తెలియని స్థితిలో చిన్నారిపడిన వేదన అంతా ఇంతా కాదు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన రితేశ్‌రెడ్డి

విషయం తెలుసుకున్న బద్వేలు టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేశ్‌కుమార్ రెడ్డి హుటాహుటిన కడప రిమ్స్‌కు చేరుకుని ముందుగా క్షతగాత్రులను పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులను, కలెక్టర్‌ను కోరారు. అనంతరం మార్చురీకి వెళ్లి మృతదేహాలను సందర్శించి వెంటనే పోస్టుమార్టం చేయాలని వైద్యులను కోరారు. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఆయనతో పాటు డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి వారిని పరామర్శించారు. అలాగే బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ కడప రిమ్స్‌కు చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

గంగిరెడ్డిపల్లెలో విషాదం

బి.కోడూరు మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కోగటం తిరుపతి రెడ్డి, శశికళ దంపతులు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జీవిస్తుండేవారు. వారికి సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డి పిల్లలు. 20 రోజులక్రితం ఉద్యోగరీత్యా తిరుపతిరెడ్డి జర్మనీ వెళ్లారు. చింతపుత్తాయపల్లెలో ఆదివారం జరిగే ఆలయ మండలపూజలో పాల్గొనేందుకు బంధువులతో కలిసి వస్తుండగా వీరి కారు గువ్వలచెరువు ఘాట్‌లో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో శశికళ ప్రాణాలతో బయటపడగా తన కుమార్తె, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో గంగిరెడ్డిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న తిరుపతిరెడ్డి జర్మనీ నుంచి బయల్దేరినట్లు బంధువులు తెలిపారు.

భగవంతుడా... మేమేం పాపం చేశాము


రిషికేశ్‌రెడ్డి ఫైల్ ఫొటో


సాయిహర్షిణి ఫైల్ ఫొటో

గువ్వల చెరువు రోడ్డు ప్రమాదంలో తల్లి ఎదుటే చిన్నారులు సాయిహర్షిణి(11), రిషికేశ్‌రెడ్డి(9) మృతిచెందడంతో "దేవుడా మేమేం పాపం చేశాము.. మాకు ఎందుకు ఇంత అన్యాయం చేశావు.. కంటికి రెప్పలా కాపాడుకుంటున్న నా బిడ్డలను నాకు నాకు ఎందుకు దూరం చేశావ్.. నా బాధ ఎవరికి చెప్పుకోవాలి" అంటూ అక్కడ కళ్లెదుటే బిడ్డలను కోల్పోయిన తల్లి శశికళ ఆవేదన అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.


అక్కాతమ్ముడు సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డిల మృతదేహాలు

జిల్లా పేరు మార్పుపై అభ్యంతరాలు నిల్

కడప, మే 24 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ జిల్లాగా ఉన్న పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ ఇటీవల ప్రభుత్వం మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుంది. అభ్యంతరాల కోసం 30 రోజుల గడువు విధించగా.. ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. కడప అనేది ఎంతో ప్రాచీనమైన, చరిత్ర గల పేరు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలకు తొలిగడప కడప అని ఇలాంటి ప్రాచీనమైన చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అయితే రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కడప జిల్లాపై తన మార్కును చాటుకున్నారు. ఆయన మరణానంతరం వైఎస్సార్ జిల్లాగా మార్చారు. అయితే జిల్లాలో కడప పేరు తీసేయడాన్ని జిల్లావాసులు ఎవరు జీర్ణించుకోలేకపోయారు. తిరుమల తొలిగడప కడపను జిల్లా పేరు నుంచి తీసేయడాన్ని సహించలేకపోయారు. ఈ నేపథ్యంలో జనం నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు వైసీపీ హయాంలో నిరసనలు, అభ్యంతరాలు వచ్చాయి. అయితే జగన్ పట్టించుకోలేదు. అయితే ప్రజల మనోభావాల కారణంగా ఇటీవల సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన మంత్రి మండలిలో జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ గెజిట్ విడుదల చేస్తూ అభ్యంతరాలపై 30రోజులు గడువు ఇచ్చింది. అయితే గడువు పూర్తయినప్పటికీ కూడా పేరు మార్పుపై ఒక్క అభ్యంతరం కూడా రాకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో సోమవారం వైఎస్సార్ కడప జిల్లాగా అధికారిక ఉత్తర్వులు జారీ అవుతాయని తెలుస్తోంది.

ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలి

● మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో జరిగిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకై ఉపాధ్యాయ సంఘ నాయ కులు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రపతి ఆమోదం కూడా పొందిన విషయాన్ని గుర్తు చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం ద్వారా విద్యారంగం బలోపేతం కావడంతో పాటు ఏళ్లతరబడి పదోన్నతులకు నోచుకోని ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పదోన్నతులు పొందుతారని, జాప్యం లేకుండా అమలుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్ బాష, ప్రధాన కార్యదర్శి ఎస్.సంగమేశ్వర రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ లీగల్ కౌన్సిల్‌గా జీఎస్ మూర్తి


జీఎస్ మూర్తి

కడప రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ మూర్తిని తిరుమల తిరుపతి దేవస్థానం లీగల్ కౌన్సిల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన 1983 నుంచి టీడీపీలో కీలక కార్యకర్తగా పనిచేస్తూ పలు హోదాలలో పనిచేశారు. ఇదివరకు వరుసగా మూడు పర్యాయాలు జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నారు. పలు కీలక కేసులలో విజయం సాధించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జిల్లాలోని నాయకులకు, కార్యకర్తలకు న్యాయపరమైన సేవలు అందించారు. క్రిమినల్ కేసులలో పోలీస్ అధికారులకు న్యాయసలహాదారుగా పనిచేశారు. ఈయన సేవలను గుర్తించిన టీడీపీ అధిష్టానం టీటీడీ లీగల్ సెల్ కౌన్సిల్‌గా నియమించింది.

నాణ్యమైన సేవలందించడమే ధ్యేయం

● రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ

కడప మారుతీనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రజలకు మరింత మెరుగైన సేవ లందించడమే ధ్యేయమని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఏదేని స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ పనుల విషయంగా నగరానికి కాస్త దూరంగా బుద్ధ టౌన్‌షిప్‌లో గల తమ కార్యాలయానికి రావాలంటే ప్రజలు ఒకింత అసౌకర్యానికి గురౌతున్నట్లు తెలిసిందన్నారు. ఆ లోటులేకుండా నగర నడిబొడ్డుగా భావించే పాత రిమ్స్‌లో ప్రభుత్వం 15 సెంట్ల స్థలాన్ని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి కేటాయించిందన్నారు. ఆ మేరకు శనివారం పాత రిమ్స్ వద్ద రిజిస్ట్రేషన్ సముదాయ భవనానికి కేటాయించిన స్థలంలో శిలాఫలకానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


రిజిస్ట్రేషన్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద అధికారులు

కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఇర్విన్, దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్, నగర అధ్యక్షుడు యు.సంజీవరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఓబులేసు, ఏపీ సబ్ రిజి స్ట్రార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అబీ జుల్లా, జిల్లా రిజి స్ట్రార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి


డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీనివాసరాజు

కడప ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలను ఎటువంటి అనుమానాలకు, అవాంతరాలకు తావులే కుండా అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనవాసరాజు, కడప జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణంరాజు జిల్లా విద్యాశాఖాధికారులను కోరారు. శనివారం వివిధ సమస్యలపై నోబెల్ టీచర్స్ అసో సియేషన్ నాయకులు కడప, అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారులు షేక్ షంషుద్దీన్, సుబ్రమణ్యంలను వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఆదేశానుసారం మాన్యువల్ కౌన్సిలింగ్ జరుగుతున్నందున ఉపాధ్యాయులు ఎవరు అసౌకర్యానికి గురి కాకుండా అన్ని వసతులతో నిర్ణీత సమయంలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బదిలీల ప్రక్రియ నిర్వహణలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, వి.వేణుగోపాల్‌రావు, ఎన్‌టీఏ నాయకులు మురళీమోహన్‌రాజు, కట్ట గంగాధర్, వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన

● నూజివీడు క్యాంపస్‌లో ఏర్పాట్లు

వేంపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో ప్రత్యేక కేటగిరీ విభాగంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 28వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్రకుమార్ సంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీన క్యాప్, స్పోర్ట్స్, 29న క్యాప్, బీఎస్‌జీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరీ, 30వ తేదీన ఎన్‌సీసీ, స్పోర్ట్స్, 31వ తేదీన ఎన్‌సీసీ కింద దరఖాస్తు చేసుకున్న ఆయా విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు.

ఇప్పటికే ఆయా విద్యార్థులకు సమాచారం ఇచ్చామని, నూజివీడు క్యాంపస్‌లో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కేటగిరీలో క్యాప్ 270, బీఎస్‌జీ 247, ఎన్‌సీసీ 1,454, స్పోర్ట్స్ 1,032 మంది హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

బాలికను కిడ్నాప్ చేసి 3 రోజులు అత్యాచారం

» వేర్వేరు నగరాల్లోని లాడ్జీలకు తిప్పి అఘాయిత్యం

» రామలింగ మఠాధిపతి హఠయోగి లోకేశ్వరస్వామీజీ అరెస్టు



బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): బాలికను కిడ్నాప్ చేసి మూడు రోజుల పాటు లాడ్జీలకు తిప్పి అత్యాచారానికి పాల్పడిన కేసులో బెళగావి జిల్లా రాయభాగ తాలూకా మేకళి గ్రామంలోని రామలింగ మఠాధిపతి హఠయోగి లోకేశ్వరస్వామీజీని పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై పోక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేసినట్టు బెళగావి జిల్లా ఎస్పీ డాక్టర్ భీమాశంకర్ గుళేద చెప్పారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పీయూ ప్రథమ సంవత్సరం విద్యార్థిని(17) అనారోగ్యం నేపథ్యంలో రామలింగ మఠాన్ని ఆశ్రయించింది. ఆ మఠాధిపతి హఠయోగి లోకేశ్వరస్వామిజీపై ఆమెకు నమ్మకం, భక్తిభావం ఏర్పడ్డాయి. ఈ నెల 13న తన మేనమామ ఊరికి వెళ్లిన బాలిక కాలి నడకన తిరిగి స్వగ్రామానికి వస్తుండగా అటుగా కారులో వచ్చిన స్వామీజీ డ్రాప్ చేస్తానంటూ కారులో ఎక్కించుకున్నాడు. కారు తమ గ్రామం మీదుగానే వెళ్తుందని తెలిసి బాలిక కారులో ఎక్కింది. అయితే, కారును ఆ గ్రామంలో ఆపకుండా స్వామీజీ బాలికను బెదిరించి రాయచూరుకు తీసుకువెళ్లాడు. అక్కడి ఓ లాడ్జిలో రెండు రోజులపాటు ఉంచి అత్యాచారం చేశాడు. అనంతరం ఈ నెల 15న బాగల్కోటెకు తీసుకెళ్లి, అక్కడి ఓ లాడ్జిలో ఉంచి అత్యాచారం చేశాడు. ఇంటికి వెళతానని బాలిక ఏడవడంతో ఈ నెల 16న మహాలింగపుర బస్టాండ్‌లో వదిలేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అనంతరం బాలిక ఇంటికి చేరుకొని జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పింది. ఈ నెల 21న బాగల్కోటె మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసును మూడలిగె పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో స్వామీజీని గురువారం అరెస్టు చేసి, శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు.

భార్య సీమంతంలో భర్తకు గుండెపోటు.. మృతి



బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): భార్యకు సీమంతం చేస్తుండగా భర్త గుండెపోటుతో మృతి చెందిన విషాద ఘటన దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ తాలూకా విట్ల సమీపంలోని మిత్తనడ్క గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సతీష్(33) భార్య ఏడు నెలల గర్భిణి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో సీమంతం నిర్వహించారు. ఆ సమయంలో సతీష్ గుండెపోటుతో కుప్పకూలారు. వెంటనే మంగళూరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా సతీష్ మృతిచెందాడు.

ఫోన్ సౌండ్ తగ్గించమన్నందుకు భార్యపై యాసిడ్

» బెంగళూరులో దారుణం.. ఆలస్యంగా వెలుగులోకి..

బెంగళూరు, మే 24(ఆంధ్రజ్యోతి): 'నిద్రపోవాలి.. ఫోన్ సౌండ్ తగ్గించు' అని చెప్పిన భార్యపై బాత్‌రూమ్ క్లీన్ చేసే యాసిడ్‌ను చల్లాడు భర్త. బెంగళూరు నగరంలోని చిక్కబాణవార ఎన్‌హెచ్‌ఎం లే అవుట్‌లో ఈ నెల 19న జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యూటీషియన్‌గా పనిచేసే భార్యను ఆ రాత్రి 9 గంటలకు మద్యం కోసం భర్త డబ్బులు అడిగాడు. ఇవ్వనన్నా.. తీవ్రంగా వేధించి డబ్బులు తీసుకుని వెళ్లి మద్యం తాగి వచ్చాడు. ఆ తర్వాత మొబైల్ ఫోన్‌లో సౌండ్ ఎక్కువగా పెట్టుకుని పాటలు వినడం ప్రారంభించాడు. తాను నిద్రపోవాలని, సౌండ్ తగ్గించాలని భార్య కోరడంతో ఆగ్రహించిన భర్త.. బాత్‌రూమ్ క్లీన్ చేసే యాసిడ్‌ను తెచ్చి ఆమెపై చల్లి పరారయ్యాడు. గాయపడ్డ ఆమెను స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని చిక్కబాణవార పోలీసులు శనివారం తెలిపారు.



నిందితుడి ఇంటిని ఎక్స్‌కవేటర్‌తో నేలమట్టం చేయిస్తున్న గ్రామస్థులు

కంబాలదిన్నె ఘటనపై గ్రామస్థుల కన్నెర్ర

» బాలికపై హత్యాచారానికి పాల్పడ్డ నిందితుడి ఇల్లు నేలమట్టం

జమ్మలమడుగు, మే 24 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా మైలవరం మండలం ఎ.కంబాలదిన్నెలో శుక్రవారం మూడేళ్ల బాలికపై అత్యాచారం చేసి, ఆపై దారుణంగా చంపేసిన నిందితుడు రహమతుల్లా ఇంటిని స్థానికులు శనివారం నేలమట్టం చేశారు. నిందితుడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. జులాయిగా తిరిగే రహమతుల్లా గ్రామానికి చెడ్డపేరు తెస్తున్నాడని ఆగ్రహించిన గ్రామస్థులు.. శనివారం ఉదయం అతడి ఇంటిని ఎక్సకవేటర్‌తో నేలమట్టం చేశారు. ఆ ఇంట్లో అతడితోపాటు ఉండే ఓ మహిళ శుక్రవారం రాత్రే ఎటో వెళ్లిపోయింది. రహమతుల్లా రోజూ మద్యం తాగి తనను చిత్రహింసలు పెట్టేవాడని పొరుగింట్లో ఉండే 80 ఏళ్ల వృద్ధురాలు కూడా ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు. మరోవైపు, హత్యాచారానికి గురైన చిన్నారి బంధువులు, కుటుంబ సభ్యులు శనివారం జమ్మలమడుగులో రోడ్డుపై బైఠాయించారు. దీంతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శనివారం అక్కడికి చేరుకుని బాధిత కుటుంబంతో మాట్లాడారు. బాలిక హత్యాచారం ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. తక్షణ సాయం కింద రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. చిన్నారి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేస్తామని చెప్పారు.

మృత్యు శకటం!

బ్రేక్ ఫెయిలై ఆగి ఉన్న కారుపైకి దూసుకొచ్చిన లారీ

» నలుగురు దుర్మరణం.. ఆలయ మండల పూజకు వస్తుండగా దారుణం

» మృతుల్లో టెకీ దంపతులు, అక్కాతమ్ముడు

» బద్వేలు ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



మృత్యుంజయురాలు శ్రీకాంత్‌రెడ్డి, శిరీషల కుమార్తె రిషికారెడ్డి



కారుపైకి దూసుకొచ్చిన లారీ

సీకేదిన్నె, మే 24 (ఆంధ్రజ్యోతి): సొంతూరిలో ఆలయ మండల పూజలో పాల్గొనడంతోపాటు, కుమార్తె పుట్టుతల తీయించేందుకు సంతోషంగా కారులో బయలుదేరినవారిపైకి మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. ఆగి ఉన్న కారుపైకి లారీ పూర్తిగా ఎక్కేయడంతో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కడప జిల్లా బద్వేలు మండలంలో శనివారం ఉదయం ఈ ఘోరం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బద్వేలు మండలం చింతపుత్తాయపల్లెకు చెందిన బసినేని శ్రీకాంత్‌రెడ్డికి (32), శిరీష (30) దంపతులకు మూడేళ్ల కూతురు రిషికారెడ్డి ఉంది. శ్రీకాంత్‌రెడ్డి దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరి సమీప బంధువులు శశికళది బి.కోడూరు మండలం గంగిరెడ్డిపల్లె కాగా, స్వర్ణలతది మేకవారిపల్లె. వీరు కూడా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. శని, ఆదివారాలు సెలవులు కావడం తమ ఊరిలో రామాలయ మండలపూజ, అలాగే తమ కుమార్తెకు పుట్టెంటుకలు తీయించాలనే ఉద్దేశంతో శనివారం తెల్లవారుజామున శ్రీకాంత్‌రెడ్డి, శిరీష, వీరి కుమార్తె రిషికారెడ్డి, శశికళ, ఆమె పిల్లలు పి.సాయిహర్షిణి(11), రిషికేశ్‌రెడ్డి(9), కోటగం స్వర్ణలత కలిసి ఒకే కారులో చింతపుత్తాయపల్లెకు బయలుదేరారు. గువ్వలచెరువు ఘాట్ దిగుతుండగా 4వ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న భారీ వాహనానికి దారిచ్చేందుకు కారును రోడ్డు పక్కన ఆపారు. ఇంతలో వెనుక నుంచి తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు టెంకాయల లోడుతో వస్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి కారుపైకి దూసుకుపోయింది. కారు నుజ్జునుజ్జయి శిరీష, శ్రీకాంత్‌తోపాటు, అక్కాతమ్ముడు సాయిహర్షితారెడ్డి, రిషికేశ్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు.

రెండు గంటలు కారులోనే..

ఉదయం 9.50 గంటలకు ప్రమాదం జరగ్గా, రెండు గంటలపాటు బాధితులంతా కారులోనే ఇరుక్కుపోయారు. సీకే దిన్నె పోలీసులు లారీని తొలగించడానికి ఎక్సకవేటర్, క్రేన్ తెప్పించారు. కారులో ఇరుక్కుపోయిన చిన్నారి రిషికారెడ్డి, స్వర్ణలత, శశికళను అతి కష్టంమీద రక్షించి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. శ్రీకాంత్‌రెడ్డి, శిరీష, సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డి మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.

పల్నాడులో టీడీపీ నేతల దారుణ హత్య



జెవిశెట్టి వెంకటేశ్వర్లు మృతదేహం



జెవిశెట్టి కోటేశ్వరరావు మృతదేహం

» బైక్‌పై వస్తుండగా అన్నదమ్ములపై దాడి

» స్కార్పియోతో ఢీకొట్టి చంపిన ప్రత్యర్థులు

» వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టెన్షన్

గుంటూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వస్తున్నవారిని స్కార్పియోతో గుద్ది దారుణంగా హత్యచేశారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన ఇద్దరు అన్నదమ్ముల కాళ్లు విరిగిపోయాయి. అక్కడికక్కడే వారు మృత్యువాతపడ్డారు. కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి మారిన ప్రత్యర్థులు రాజకీయ ఆధిపత్యంలో భాగంగా ఇంత ఘాతుకానికి ఒడిగట్టారు. పల్నాడులోని వెల్దుర్తి మండలం గుండ్లపాడులో శనివారం ఈ ఘటన కలవరం రేపింది. వైసీపీ హయాంలో ఆ పార్టీ గూండాలు హత్యచేసిన టీడీపీ నేత చంద్రయ్యది కూడా ఇదే గ్రామం.గుండ్లపాడు గ్రామంలో చంద్రయ్య, జెవిశెట్టి వెంకటేశ్వర్లు(మొద్దయ్య) (60), తమ్ముడు కోటేశ్వరరావు(56) టీడీపీలో కీలక నేతలు. చంద్రయ్య హత్యకు గురైనప్పటినుంచి ఈ అన్నదమ్ములే పార్టీ వ్యవహారాలను గ్రామంలో చక్కబెడుతున్నారు. అయితే గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న వెంకట్రామయ్య వర్గం, ఆ తరువాత టీడీపీలో చేరింది. గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కోసం వెంకటరామయ్య ఎంతోకాలంగా ప్రయత్నిస్తున్నారు. అయితే వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులకు గ్రామంలో మంచి పట్టు ఉంది. దీంతో వారిద్దరు ఉన్నంతవరకు గ్రామంలో తన ఆధిపత్యం నడవదని వెంకట్రామయ్య భావించారు. రెండు రోజుల క్రితం పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు గ్రామంలో పల్లెనిద్రకు వచ్చారు. ఎస్పీ వెళుతూ.. గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా పెద్దమనిషిగా ఉన్న జెవిశెట్టి వెంకటేశ్వర్లును సంప్రదించాలని సూచించారు. ఎస్పీ ప్రకటన కూడా వెంకట్రామయ్యకు కంటకింపుగా మారింది. అలాగే, వెంకట్రామయ్య వర్గానికి చెందిన శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి రెండు కాళ్లు కొంతమంది వ్యక్తులు విరగ్గొట్టారు. ఈ ఘటనలో దాడి చేసినవారికి వెంకటేశ్వరరావు మద్దతుగా నిలవడం కూడా వెంకట్రామయ్యకు రుచించలేదు. దీంతో వారిరువురిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. వారిద్దరి పెదనాన్న కుమారుడు జెవిశెట్టి శ్రీనివాసరావు(బొబ్బిలి) అనే వ్యక్తితో కలిసి వెంకట్రామయ్య పక్కా ప్లాన్ రచించారు. వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుతోపాటు వెంకటేశ్వర్లు అల్లుడు తోట ఆంజనేయులు, మరో 12 మంది తెలంగాణలోని సూర్యాపేట జిల్లా నక్కలగూడెం గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లారు. వేడుక ముగించుకుని ద్విచక్ర వాహనాలపై శనివారం గ్రామానికి బయలుదేరారు. మిగిలిన వారంతా మాచర్లలో ఆగి టీ తాగుతుండగా వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై గుండ్లపాడుకు బయలుదేరారు. గ్రామానికి వెళ్లే మార్గంలో అప్పటికే వారి ప్రత్యర్థులు తోట వెంకటరామయ్య, జెవిశెట్టి శ్రీనివాసరావు, మరో ఇరువురు ముందే రెక్కీ నిర్వహించి దాడికి సిద్ధంగా ఉన్నారు. స్కార్పియో వాహనంలో గుండ్లపాడు నుంచి మాచర్లకు వచ్చేమార్గంలో అన్నదమ్ముల ద్విచక్ర వాహనానికి ఎదురుగా వచ్చారు. భోజనవీడు- మండాది గ్రామాలకు మధ్యలో అతివేగంగా స్కార్పియోతో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో అన్నదమ్ములు రోడ్డు పక్కన ఉన్న నాలుగడుగుల కట్ట మీద నుంచి ఎగిరి 10 అడుగుల దూరంలో పడిపోయారు. వారి ఇరువురి కాళ్లు విరిగిపోయాయి. తీవ్రంగా రక్తస్రావమై వారిరువురి ప్రాణాలు పోయాయా లేదంటే కదల్లేని స్థితిలో ఉన్నవారిని హత్య చేశారా అన్నదానిపై స్పష్టత రాలేదు. అయితే వారి ఒంటిపై వేరే గాయాలు లేవని పోలీసులు అంటున్నారు. సమీపంలో ఎక్కడా కూడా మారణాయుధాలు పోలీసులకు లభించలేదు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంతోపాటు స్కార్పియో ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటన జరిగిన పది నిమిషాల్లోనే వెంకటేశ్వర్లు అల్లుడు తోట ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై వెనుకనే వచ్చారు. ఆ సమయానికి వెంకట్రామయ్య, శ్రీనివాసరావు డ్రైవర్‌తో పాటు మరొకరు స్కార్పియోను అక్కడే వదిలేసి రచ్చమల్లపాడు వెళ్లే డొంకలోకి పారిపోతుండటాన్ని ఆంజనేయులు చూశారు. పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

భూముల విక్రయం పేరుతో జోగి మోసం

» ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపి 2021లో విక్రయానికి సిద్ధపడ్డ మాజీ మంత్రి

» 90 లక్షలు వసూలు చేశాక ముఖం చాటు

» కృత్తివెన్ను పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



మచిలీపట్నం, మే 24(ఆంధ్రజ్యోతి): భూముల విక్రయం పేరుతో మాజీ మంత్రి, పెడన మాజీ ఎమ్మెల్యే జోగి రమేశ్ చేసిన మోసం బయటపడింది. వైసీపీ అధికారంలో ఉండగా ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపి రూ. 90 లక్షల కాజేసిన వైనం వెలుగులోకి వచ్చిం ది. దీనికి సంబంధించి కృష్ణాజిల్లా కృత్తివెన్ను పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామంలో ఎకరం రూ. 3 లక్షల చొప్పున 30 ఎకరాలు రైతులు అమ్మడానికి సిద్ధంగా ఉన్నారని పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన తమ్మా వీరవెంకటప్రసాద్, ఆయన కుమారుడు కల్యాణ్‌కుమార్‌లను 2021లో జోగి రమేశ్, ఆయన అనుచరులు నమ్మించారు. ఏ ఇబ్బంది వచ్చినా తాము చూసుకుంటామని భరోసా ఇచ్చారు. విడతల వారీగా రూ. 90 లక్షలు చెల్లించిన తర్వాత ఆ భూమిని చూపకుండా, రిజిస్ట్రేషన్ చేయించకుండా రమేశ్ తప్పించుకు తిరిగారు. దీనిపై అనుమానం వచ్చి విచారణ చేస్తే అది ప్రభుత్వ భూమి అని తెలుసుకున్నారు. తమ డబ్బు తిరిగి ఇవ్వాలని కోరినా మాజీ మంత్రి పట్టించుకోవడంలేదు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు.

బెజవాడ, విశాఖల్లో బాంబు బెదిరింపు కలకలం



బెజవాడ బీసెంట్ రోడ్డులో తనిఖీలు చేస్తున్న బాంబు స్క్వాడ్

» బీసెంట్ రోడ్డు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు

» పోలీసు కంట్రోల్ రూంకే ఫోన్ చేసిన ఆగంతకుడు

» విశాఖలో ఎల్‌టీటీకి బెదిరింపు



విశాఖ రైల్వే ప్లాట్‌ఫామ్‌పై బాంబ్, డాగ్ స్క్వాడ్ల తనిఖీ

విజయవాడ, విశాఖపట్నం మే 24 (ఆంధ్రజ్యోతి): బెజవాడను శనివారం బాంబు బెదిరింపు కాల్ కలవర పెట్టింది. అలాగే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు పెట్టినట్లు ఫేక్ కాల్ రావడంతో విశాఖ రైల్వేస్టేషన్‌లోనూ కలకలం రేగింది. చివరికి ఎక్కడా ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శనివారం ఉదయం విజయవాడ బీసెంట్ రోడ్డు, రైల్వే స్టేషన్‌లలో బాంబులు అమర్చినట్టు ఓ ఆగంతకుడు పోలీసు కంట్రోల్ రూముకే ఫోన్ చేశాడు. హిందీలో మాట్లాడిన ఆగంతకుడు.. ముందుగా బీసెంట్ రోడ్డు పేరు చెప్పాడు. తర్వాత స్టేషన్.. అని మాత్రమే చెప్పి ఫోన్ కట్ చేశాడు. అప్రమత్తమైన కంట్రోల్ రూం సిబ్బంది ఉన్నతాధికారులకు తెలియజేశారు. వారు స్థానిక పోలీసులతోపాటు సిటీ సెక్యూరిటీ వింగ్, ఏఆర్, బాంబు డిటెక్టివ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. ఆగంతకుడు స్టేషన్.. అని చెప్పడంతో పోలీసులు రైల్వేస్టేషన్‌లో సోదాలు నిర్వహించారు. అణువణువూ జల్లెడ పట్టారు. రాఘవయ్య పార్కు నుంచి ఏలూరు రోడ్డు వరకు ఉన్న బీసెంట్ రోడ్డు మొత్తాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎక్కడా బాంబు ఛాయలు గానీ, దాని మూలాలు గానీ కనిపించలేదు.

విశాఖ స్టేషన్‌లో తనిఖీలు..

ముంబై నుంచి విశాఖపట్నం వస్తున్న రైలు(18520)లో బాంబు ఉందని బెదిరింపు కాల్ రావడంతో శనివారం విశాఖ రైల్వే స్టేషన్లో కలకలం రేగింది. ఆ రైలులో బాంబు ఉందని రైల్వే అధికారులకు అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ రావడంతో జీఆర్‌పీ, టాస్క్ ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు అప్రమత్తమై తనిఖీలు చేయగా ఏమీ లేదని తేలింది.

వంశీకి అస్వస్థత

» విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం

» అనంతరం నూజివీడు కోర్టులో హాజరు

» అక్కడా వైద్య పరీక్షలు చేయించిన జడ్జి

» ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందన్న వైద్యులు

» మళ్లీ విజయవాడ జైలుకు తరలింపు



మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చిన పోలీసులు

విజయవాడ/నూజివీడు, మే 24(ఆంధ్రజ్యోతి): నకిలీ ఇళ్ల పట్టాల కేసులో విచారణ ఎదుర్కొంటున్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అస్వస్థతకు లోనయ్యారు. కస్టడీలో భాగంగా పోలీసులు వంశీని కంకిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో వాంతులు చేసుకోవడంతో పీహెచ్‌సీకి తరలించారు. శనివారం ఉదయం వరకు వైద్యం అందజేశారు. తర్వాత స్టేషన్‌కు తరలించారు. పోలీసులు విచారణకు సిద్ధమవుతుండగా, మళ్లీ వాంతులయ్యే సూచనలు ఉన్నాయని వంశీ చెప్పారు. దీంతో ఆయన్ను పోలీసులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, నీరసంగా ఉండడం వల్ల వాంతులు అయినట్టు తెలిపారు. దీంతో పోలీసులు రెండో రోజు వంశీని విచారించకుండానే కోర్టులో హాజరుపరిచారు.

బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఇళ్లపట్టాల కేసులో వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణను నూజివీడు కోర్టు ఈనెల 26 కు వాయిదా వేసింది. వంశీని కస్టడీకి తీసుకున్న హనుమాన్ జంక్షన్ పోలీసులు నూజివీడు కోర్టులో హాజరు పరిచిన సందర్భంగా ఫ్లూయిడ్స్ ఎక్కించేందుకు ఆయన చేతికి ఉన్న కాన్యులాను జడ్జి గమనించారు. నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్యులను పిలిపించి వంశీ ఆరోగ్యంపై వివరణ కోరారు. ఆయనకు నీరసం తప్ప మిగతా ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు చెప్పారు. కాన్యులాను తొలగించి ప్లాస్టర్ వేశారు. అనంతరం పోలీసులు వంశీని విజయవాడ జైలుకి తరలించారు.



రెండు రోజుల పోలీస్ కస్టడీకి పీఎస్ఆర్, మధు

» గ్రూప్-1 కేసులో విజయవాడ కోర్టు ఉత్తర్వులు

» నేటి నుంచి పోలీసు విచారణ ప్రారంభం

» పీఎస్ఆర్‌కు అస్వస్థత.. బీపీలో హెచ్చుతగ్గులు

పీఎస్సార్ ఆంజనేయులును విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చిన పోలీసులు



విజయవాడ, మే 24(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూపు-1 కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, పమిడికాల్వ మధుసూదన్‌లను రెండు రోజులు పోలీసు కస్టడీకి ఇస్తూ కోర్టు శనివారం ఉత్తర్వులిచ్చింది. ఈ ఇద్దరు విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టడానికి వారం పాటు కస్టడీకి ఇవ్వాలని సూర్యారావుపేట పోలీసులు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ వేశారు. రెండు రోజుల క్రితం దీనిపై వాదనలు ముగిశాయి. రెగ్యులర్ కోర్టుకు సెలవులు కావడంతో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి అప్పారావు తీర్పు చెప్పారు. ఆదివారం ఉదయం 6 గంటలకు జైలు నుంచి పీఎస్ఆర్, మధుసూదన్‌లను కస్టడీకి తీసుకుని సోమవారం సాయంత్రం ఐదు గంటలకు తిరిగి జిల్లా జైలుకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. జైలు నుంచి తీసుకెళ్లేటప్పుడు తిరిగి అప్పగించేటప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, జైల్లో ఉన్న పీఎస్ఆర్ శనివారం అస్వస్థతకు లోనయ్యారు. బీపీలో హెచ్చుతగ్గులు ఉండడంతో జైలు అధికారులు ఆయన్ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించిన అనంతరం తిరిగి జైలుకు తీసుకెళ్లారు. కాదంబరి జెత్వాని కేసులో కోర్టు పోలీసు కస్టడీకి ఇచ్చినప్పుడు కూడా ఆయన బీపీలో హెచ్చుతగ్గులతో ఇబ్బంది పడ్డారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No :717 B/5, Thukivakam (Village & Post), Renigunta (Mandal) Chittoor District, Pin - 517520, Andhra Pradesh. Editor : N.Rahul Kumar.
RNI No:44936/1987. Managing Director : Vemuri Radhakrishna. Founder : K.L.N. Prasad.